# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 13 | ఎడిటర్: మేనం శ్యామ్ | శనివారం 01-08-2026 | పేజీలు: 10





## సిరా చుక్క

ఉద్యమ జ్యోతి – పెద్ది సుదర్శన్ రెడ్డి
తెలంగాణ ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర
వేసిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి.
ప్రజల కోసం రాజకీయాన్ని సేవగా భావించిన
అరుదైన వ్యక్తిత్వం ఆయనది.
తెలంగాణ సాధనే లక్ష్యంగా
ఎన్నో ఉద్యమాల్లో ముందుండి పోరాడారు.
ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయ
ధ్యేయంగా భావించారు.
పదవుల కంటే ప్రజల ప్రేమకే
ఎక్కువ విలువ ఇచ్చారు.
ఉద్యమ స్ఫూర్తిని గ్రామాల వరకు తీసుకెళ్లడంలో
కీలక పాత్ర పోషించారు.
సాధారణ కార్యకర్త నుంచి ప్రజానాయకుడిగా
ఎదిగిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకం.
ఆయన నిబద్ధత, నిజాయితీ, అంకితభావం
అందరికీ ఆదర్శం.
భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు
శాశ్వతంగా నిలిచిపోతాయి.
ప్రజల గుండెల్లో ఆయనకు ప్రత్యేక స్థానం
ఎప్పటికీ ఉంటుంది.
ఆయన చేసిన సేవలను తెలంగాణ సమాజం
ఎన్నటికీ మరచిపోదు.
ఆయన ఆశయాలను కొనసాగించడమే
నిజమైన నివాళి.
పెద్ది సుదర్శన్ రెడ్డి గారి ఆత్మకు శాంతి
చేకూరాలని ప్రార్థిస్తున్నాము.
కుటుంబ సభ్యులకు, అభిమానులకు,
బీఆర్ఎస్ కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతి
తెలియజేస్తున్నాము.

– మీ మనోసంచారి ..
హర్ష వర్ధన్ రెడ్డి జార..
నారాయణఖేడ్..

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ బదిలీకి హైకోర్టు ఆదేశాలు

- కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించారని తీవ్ర ఆగ్రహం
- కొత్త అధికారిని నియమించాలని సీఎస్‌కు ఆదేశం
- లోతుకుంట భూ వివాదం కేసులో కీలక తీర్పు
- చట్టం ముందు ఎవరూ అతీతులు కారని ధర్మాసనం వ్యాఖ్య



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన లోతుకుంట భూ వివాదం కేసులో తెలంగాణ హైకోర్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టుకు ఇచ్చిన హామీని, న్యాయస్థానం ఉత్తర్వులను ఉల్లంఘించారని తేల్చిన ధర్మాసనం.. ఆయనను వెంటనే హైడ్రా కమిషనర్ పదవి నుంచి బదిలీ చేసి, ఆయన స్థానంలో మరో అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి (సీఎస్) ఆదేశాలు జారీ చేసింది.

**కోర్టు హామీని ఉల్లంఘించారన్న హైకోర్టు...**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా లోతుకుంటలోని వివాదాస్పద భూమి వ్యవహారంలో ఆ స్థలంలోకి ప్రవేశించబోమని, ఎలాంటి చర్యలు చేపట్టబోమని హైడ్రా తరఫున కోర్టుకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారని హైకోర్టు

మిగతా 2లో

## నాపై జరుగుతోంది కుట్ర.. వైరల్ వార్తలు ఫేక్

- ఏవీ రంగనాథ్
- జైలు శిక్ష ప్రచారాన్ని ఖండించిన హైడ్రా కమిషనర్
- సోషల్ మీడియాలో జరుగుతున్నది అసత్య ప్రచారమేనని స్పష్టీకరణ
- అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని ప్రజలకు సూచన
- బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మీడియాకు విజ్ఞప్తి

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తనపై ఉద్దేశపూర్వకంగా కుట్ర జరుగుతోందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ హైకోర్టు తనకు నెల రోజుల జైలు శిక్ష విధించిందంటూ సోషల్ మీడియా, కొన్ని మీడియా సంస్థల్లో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. ప్రజలు, మీడియా ప్రతినిధులు ఫేక్ న్యూస్‌ను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని సూచించారు.

**జైలు శిక్ష వార్తల్లో నిజం లేదు...**

ఇటీవల సోషల్ మీడియాలో ఏవీ రంగనాథ్‌కు

మిగతా 2లో

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మరో ఊరట

- నవంబర్ 30 వరకు ఫీజుల చెల్లింపు గడువు పొడిగింపు
- 25 శాతం రాయితీ కొనసాగింపు
- ఎస్ఐఆర్ కారణంగా ఆలస్యమైన దరఖాస్తుల పరిశీలన
- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని ఆదేశాలు




**ప్రజా వాయిస్, హైదరాబాద్:** ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుదారులకు తెలంగాణ ప్రభుత్వం మరోసారి ఊరట కల్పించింది. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఫీజులు, ఛార్జీల చెల్లింపు గడువును నవంబర్ 30 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే అమలులో ఉన్న 25 శాతం రాయితీని కూడా కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ జీఓ ఎంఎస్ నెం. 213ను విడుదల చేశారు.

**ఎస్ఐఆర్ కారణంగా గడువు పొడిగింపు...**

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్లానింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారులకు మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నాలుగు

మిగతా 2లో

## పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో భార్య రోదనలు

- 'నా భర్తను పొట్టన పెట్టుకున్నారు' అంటూ ఆవేదన
- వైరల్ అవుతున్న వీడియోపై చర్చ
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు
- నర్సంపేటలో విషాద ఛాయలు

2లో



## తెలంగాణలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రారంభం




- ప్రభుత్వ సేవలకు ఒకే కుటుంబ ధ్రువీకరణ పత్రం
- మీ సేవ, ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు
- రేషన్ కార్డు డేటాతో అనుసంధానం
- 18 ఏళ్లు నిండిన కుటుంబ సభ్యుడెవరైనా దరఖాస్తుకు అర్హులు

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలతో కూడిన ఈ సర్టిఫికెట్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ ప్రభుత్వ సేవలు, అధికారిక ధ్రువీకరణ అవసరాలకు ఉపయోగపడనుంది. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు.

**ప్రభుత్వ సేవలకు ఒకే ధ్రువీకరణ పత్రం...**


మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడిన భట్టి విక్రమార్క.. కుటుంబ సభ్యుల వివరాలన్నింటినీ ఒకే ధ్రువీకరణ పత్రంలో అందించేలా ఈ విధానాన్ని ప్రభుత్వం

మిగతా 2లో

## తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు మరోసారి పొడిగింపు

- ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ
- రాష్ట్రంలో 77.12 శాతం ప్రక్రియ పూర్తి
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లో కొనసాగుతున్న నమోదు
- అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా విడుదల

2లో




## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై కేసు



- లైంగిక దాడి, మోసం ఆరోపణలతో పంజాగుట్టలో ఎఫ్ఐఆర్
- కేసు కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే
- ఫిర్యాదుపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- ఫిర్యాదుపై యువతి వ్యాఖ్యలతో కొత్త ట్విస్ట్

2లో

## ఉగ్రరూపం దాల్చిన గోదావరి

- 48 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- ఎగువ నుంచి ఉధృతంగా వస్తున్న వరద
- లోతట్టు ప్రాంతాల ప్రజలకు అలర్ట్
- సహాయక బృందాల మోహరింపు..
- నది తీరం, ఘాట్లకు వెళ్లొద్దని పోలీసుల హెచ్చరిక



**ప్రజా వాయిస్,భద్రాచలం:** దక్షిణ గంగగా పిలిచే గోదావరి మరోసారి తన ఉగ్రరూపాన్ని చూపిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వరద ప్రవాహం ఉద్ధృతంగా మారి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరుకుంది. ప్రమాద స్థాయి దిశగా వరద దూసుకెళ్తుండటంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందన్న అంచనాలతో జిల్లా యంత్రాంగం హై అలర్ట్ ప్రకటించింది.

**గంట గంటకూ పెరుగుతున్న ప్రవాహం...**

ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో గోదావరి ఉప్పొంగుతోంది. ప్రవాహం ఇదే స్థాయిలో కొనసాగితే నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాచలం పరిసర లోతట్టు ప్రాంతాలు, నదీ పరీవాహక గ్రామాల్లో

మిగతా 2లో

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ బదిలీకి హైకోర్టు ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

గుర్తు చేసింది. అయితే అనంతరం భారీ పోలీసు బలగాలు, జేసీబీలు, సిబ్బందితో అక్కడికి వెళ్లి తాత్కాలిక నిర్మాణాలను తొలగించడం కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనేనని ధర్మాసనం స్పష్టం చేసింది.

**వ్యక్తుల పాలన కాదు.. చట్ట పాలనే ఉండాలి...**

చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే కోర్టు ఆదేశాలను ధిక్కరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. వ్యక్తుల పాలన కాదు.. చట్ట పాలనే కొనసాగాలని స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ధర్మాసనం పేర్కొంది.

**సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రస్తావన...**

తాతా మోహన్‌రావు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన హైకోర్టు.. కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం ప్రతి ప్రభుత్వ అధికారి రాజ్యాంగబద్ధ బాధ్యత అని గుర్తు చేసింది. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు కూడా విరుద్ధమని స్పష్టం చేసింది.

**క్షమాపణ అఫిడవిట్ తిరస్కరణ...**

కోర్టు ఒత్తిడి తర్వాత సమర్పించిన క్షమాపణ అఫిడవిట్‌ను అంగీకరించలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. చట్టానికి లోబడి వ్యవహరించే మరో అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని సీఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.



# నాపై జరుగుతోంది కుట్ర.. వైరల్ వార్తలు ఫేక్

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ కేసులో నెల రోజుల జైలు శిక్ష విధించిందంటూ పెద్దఎత్తున పోస్టులు వైరల్ అయ్యాయి. ఈ ప్రచారాన్ని ఖండించిన ఆయన.. ఆ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. తనపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

**ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం...**

తాను ముందుగానే ఊహించినట్లుగానే కొందరు సోషల్ మీడియా వేదికగా తన ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఏవీ రంగనాథ్ ఆరోపించారు. తనపై జరుగుతున్న ప్రచారం మొత్తం ఫేక్ న్యూస్ అని కొట్టిపారేస్తూ, ప్రజలు ఇలాంటి ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు.

**అధికారిక సమాచారాన్నే నమ్మాలి...**

సోషల్ మీడియాలో వైరల్ అయ్యే ప్రతి సమాచారాన్ని నిజమని భావించి షేర్ చేయవద్దని ఏవీ రంగనాథ్ సూచించారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు లేదా అధికారిక వర్గాల నుంచి వచ్చే ప్రకటనలనే విశ్వసించాలని తెలిపారు. అధికారిక ధృవీకరణ లేని వార్తలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి...**

అసత్య ప్రచారాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏవీ రంగనాథ్ విజ్ఞప్తి చేశారు. వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రసారం చేయాలని సూచించారు.

# ఉగ్రరూపం దాల్చిన గోదావరి

మొదటి పేజీ తరువాయి




ఆందోళన నెలకొంది.

**అధికార యంత్రాంగం అప్రమత్తం**

వరద పరిస్థితిని జిల్లా కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖల బృందాలు క్షేత్రస్థాయిలో మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. అవసరమైతే ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

**గోదావరి వద్దకు వెళ్లొద్దు..!**

గోదావరి తీరం, ఘాట్లు, వంతెనల వద్దకు ఎవరూ వెళ్లరాదని అధికారులు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. వరద నీటిలోకి దిగడం, సెల్ఫీలు, వీడియోల కోసం నది ఒడ్డుకు చేరడం ప్రాణాంతకమని స్పష్టం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

# తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు మరోసారి పొడిగింపు

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి గడువు పొడిగించింది. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఇంకా నమోదు చేయని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు.

**రెండోసారి గడువు పెంపు...**

మొదట ఎస్ఐఆర్ ప్రక్రియకు జూలై 24 వరకు గడువు నిర్ణయించగా, రాజకీయ పార్టీల విజ్ఞప్తితో దానిని ఆగస్టు 3 వరకు పొడిగించారు. తాజాగా రాష్ట్రంలో ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో మరోసారి గడువును ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

**77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తి...**


తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం ఎన్యూమరేషన్ పూర్తైంది. జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్‌లో 56.31 శాతం, రంగారెడ్డి జిల్లాలో 63.43 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61.37 శాతం మాత్రమే నమోదు పూర్తికావడంతో ఆయా జిల్లాల్లో ప్రక్రియ కొనసాగుతోంది.

**ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు...**

గడువు పొడిగింపుతో ఎన్నికల షెడ్యూల్‌లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ కొనసాగనుండగా, అదే రోజు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. అనంతరం ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన చేపట్టి, అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించనుంది.

**అర్హులైన ఓటర్లు నమోదు చేసుకోవాలి...**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు స్వీకరిస్తున్నారు. అనంతరం వాటిని ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి డిజిటలైజేషన్ చేస్తున్నారు. ఇప్పటివరకు ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఆగస్టు 10లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు విజ్ఞప్తి చేశారు.






# మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై కేసు

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత రేగా కాంతారావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఉద్యోగ ఇంటర్వ్యూ పేరుతో ఫ్లాట్‌కు పిలిపించుకుని లైంగిక దాడికి పాల్పడ్డారని, అనంతరం పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని ఓ యువతి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో తన వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

**పలు సెక్షన్ల కింద కేసు...**

బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీసులు రేగా కాంతారావుపై సంబంధిత చట్టాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

**హైకోర్టును ఆశ్రయించిన రేగా...**

తనపై నమోదైన కేసు రాజకీయ ప్రేరేపితమని భావిస్తున్న రేగా కాంతారావు, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారం న్యాయస్థానం పరిశీలనలో ఉంది.

**యువతి వ్యాఖ్యలతో కొత్త మలుపు...**

ఇదిలా ఉండగా, ఈ కేసుకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మీడియాలో మాట్లాడిన సదరు యువతి, తాను ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నట్లు సమాచారం. తన వివరాలు ఎలా వినియోగించబడ్డాయో తెలియదని, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆమె చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి.

**దర్యాప్తుతోనే వాస్తవాలు...**

ఒకవైపు ఎఫ్ఐఆర్ నమోదు కాగా, మరోవైపు యువతి చేసిన తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి వాస్తవాలను వెలికితీసేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మరో ఊరట




మొదటి పేజీ తరువాయి

నెలల పాటు గడువును పొడిగించింది.

**25.70 లక్షల దరఖాస్తులు...**

రాష్ట్రంలో అనుమతిలేని లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25.70 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఫీజుల చెల్లింపులు, దరఖాస్తుల పరిష్కారం ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తొలుత 50 శాతం, అనంతరం 25 శాతం రాయితీ ప్రకటించింది.

**రూ.10 వేల కోట్ల లక్ష్యం...**

ఎల్ఆర్ఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు రూ.10 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు సుమారు రూ.2 వేల కోట్ల మేర మాత్రమే వసూళ్లు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఆదాయాన్ని పెంచడంతో పాటు పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలనే ఉద్దేశంతో గడువును నవంబర్ 30 వరకు పొడిగించింది.

**దరఖాస్తుదారులకు ప్రభుత్వ సూచన...**

ఇప్పటికే ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని ఫీజులు చెల్లించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అలాగే సంబంధిత శాఖలు పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది.

# పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో భార్య రోదనలు



**ప్రజా వాయిస్, నర్సంపేట:** బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో విషాద వాతావరణం నెలకొంది. ఆయన భార్య పెద్ది స్వప్న గుండెలవిసేలా రోదించడం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. అంతిమయాత్ర సందర్భంగా ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారి చర్చనీయాంశమవుతున్నాయి.

**'నా భర్తను పొట్టన పెట్టుకున్నారు'...**

అంతిమయాత్ర సందర్భంగా వాహనంపై ఉన్న పెద్ది స్వప్న, తన భర్త మృతికి ఎవరినో కారణంగా పేర్కొంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "నా భర్తను పొట్టన పెట్టుకున్నారు" అంటూ ఆమె రోదించిన వీడియోలు ప్రస్తుతం విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఆమె ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారన్నది స్పష్టత రావాల్సి ఉంది.

**ఆర్తనాదాలతో కన్నీరుమున్నీరైన అంతిమయాత్ర...**

సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహాన్ని నర్సంపేటకు తీసుకువచ్చి అంతిమయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా "లేవయ్యా... నిన్ను చూసేందుకు వేలాది మంది వచ్చారు", "నువ్వు లేక నేను ఎలా బతుకుతాను" అంటూ పెద్ది స్వప్న చేసిన ఆర్తనాదాలు అక్కడున్న వారిని తీవ్ర భావోద్వేగానికి గురిచేశాయి.

**వైరల్ వీడియోలపై చర్చ...**

అంతిమయాత్రలో పెద్ది స్వప్న చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఆమె వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారన్న అంశంపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. దీంతో ఈ వ్యవహారం రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**భారీగా తరలివచ్చిన అభిమానులు...**

పెద్ది సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కన్నీటి వీడ్కోలు పలికారు. నర్సంపేటలోని పలు వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూతపడి సంతాపం ప్రకటించగా, అంతిమయాత్ర కారణంగా ప్రధాన రహదారులపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

# ఫార్ములా ఈ-కార్ రేసు కేసు విచారణ ఆగస్టు 25కి వాయిదా

- ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్, అర్వింద్ కుమార్
- నాంపల్లి కోర్టు వద్ద భారీగా చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- రూ.55 కోట్ల నిధుల వినియోగంపై కొనసాగుతున్న విచారణ



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** రూ.55 కోట్ల ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో విచారణను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో పాటు, ఏ2 నిందితుడిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ కోర్టుకు హాజరయ్యారు.

**కోర్టుకు హాజరైన నిందితులు...**

శుక్రవారం జరిగిన విచారణకు కేటీఆర్, అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.ఎన్. రెడ్డి ఏసీబీ ప్రత్యేక కోర్టులో ప్రత్యక్షమయ్యారు. తదుపరి విచారణను ఆగస్టు 25కి వాయిదా వేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

**భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు...**

కేటీఆర్‌కు మద్దతుగా మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నాంపల్లి కోర్టు ఆవరణకు చేరుకున్నారు. దీంతో కోర్టు పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

**రూ.55 కోట్ల వ్యయంపై ఆరోపణలు...**

ఫార్ములా ఈ-కార్ రేసు నిర్వహణ, రేసింగ్ ట్రాక్ నిర్మాణం, ఇతర ఏర్పాట్ల కోసం హెచ్ఎండీఏ నిధుల నుంచి రూ.55 కోట్లకు పైగా ఖర్చు చేశారని ఏసీబీ అభియోగాలు మోపింది. ప్రభుత్వ అనుమతులు, నిబంధనలను పాటించకుండా ఈ నిధులు వినియోగించారని దర్యాప్తులో పేర్కొంది.

**ఆర్‌బీఐ మార్గదర్శకాల ఉల్లంఘన ఆరోపణలు...**

విదేశీ సంస్థలకు నిధుల బదిలీ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలతో పాటు పన్ను నిబంధనలను కూడా ఉల్లంఘించారని ఏసీబీ ఆరోపించింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ ఖజానాపై రూ.8.06 కోట్ల అదనపు పన్ను భారం పడిందని తెలిపింది. ప్రభుత్వం నుంచి ప్రాసిక్యూషన్ అనుమతులు పొందిన అనంతరం కేటీఆర్, అర్వింద్ కుమార్‌లపై ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

# తెలంగాణలో ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ శాఖలు, ఇతర సంస్థలు కుటుంబ వివరాలు కోరినప్పుడు ఈ ఫ్యామిలీ సర్టిఫికెట్ అధికారిక ధ్రువపత్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు.

**సర్టిఫికెట్‌లో పూర్తి కుటుంబ వివరాలు...**

ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, కుటుంబ యజమానితో సంబంధం, వయస్సు, పుట్టిన తేదీ, లింగం, ఆధార్ నంబర్, ప్రస్తుత నివాస చిరునామా వంటి పూర్తి వివరాలు నమోదు చేయనున్నారు. ఈ సమాచారం ప్రభుత్వ అధికారిక రికార్డుల ఆధారంగా సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు.

**రేషన్ కార్డుతో అనుసంధానం...**

ఈ విధానాన్ని ఫుడ్ సెక్యూరిటీ (రేషన్) కార్డు డేటాబేస్‌తో అనుసంధానం చేశారు. ప్రతి కుటుంబానికి ప్రత్యేక ఫ్యామిలీ రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్ కేటాయించనుండగా, సాధారణంగా రేషన్ కార్డు నంబరునే గుర్తింపు సంఖ్యగా పరిగణించనున్నారు. దీంతో కుటుంబ వివరాల ధ్రువీకరణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

**మీ సేవ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు...**

ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం సమీపంలోని మీ సేవా కేంద్రాలు, మీ సేవ ఆన్‌లైన్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఒక కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన ఏ సభ్యుడైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అనంతరం సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయం దరఖాస్తును పరిశీలించి సర్టిఫికెట్ జారీ చేయనుంది.

**పారదర్శక సేవలే లక్ష్యం...**

ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందించడంతో పాటు కుటుంబ వివరాల ధ్రువీకరణను సులభతరం చేయడమే ఫ్యామిలీ సర్టిఫికెట్ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

# ప్రజా సమస్యలే అజెండా

- క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
- అద్దె ఇళ్ల బాధితులకు స్మశానవాటికలో రెండు ప్రత్యేక గృహాల నిర్మాణానికి శ్రీకారం
- గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం
- ఆహార నాణ్యతపై ఆరాఅమృత్ 2.0 వాటర్ ట్యాంక్ పనుల పరిశీలన
- నాణ్యత, వేగంపై అధికారులకు ఆదేశాలు





**ప్రజా వాయిస్,మిర్యాలగూడ.**ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ, సంక్షేమ కార్యక్రమాల అమలుపై దృష్టి సారిస్తూ మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం రోజంతా విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలు ఎదుర్కొంటున్న మానవీయ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే నిర్ణయం తీసుకోగా, మరోవైపు గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం అమృత్ స్కీమ్–2.0 కింద నిర్మిస్తున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను తనిఖీ చేసి నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాల్లో మరణాలు సంభవించినప్పుడు మృతదేహాలను ఇంట్లోకి అనుమతించని ఘటనలను దృష్టిలో ఉంచుకుని హిందూ స్మశానవాటికలో రెండు ప్రత్యేక గృహాలను నిర్మించాలని ఎమ్మెల్యే నిర్ణయించారు. స్థానిక రైస్ మిల్లర్ల సహకారంతో ఈ నిర్మాణాలు చేపడతామని ప్రకటించారు. అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకు మృతదేహాలను గౌరవప్రదంగా ఉంచేందుకు, కుటుంబ సభ్యులు, బంధువులు వేచి ఉండేందుకు ఈ గృహాలు ఉపయోగపడతాయని తెలిపారు. స్మశానవాటికలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.అనంతరం మిర్యాలగూడ సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థుల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకుని, ఆహార నాణ్యత, ఫుడ్ మెనూ, విద్యా బోధన, మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని అధికారులకు సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.సాయంత్రం హౌసింగ్ బోర్డు ప్రాంతంలో అమృత్ స్కీమ్–2.0 కింద నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్ ప్రతినిధులకు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి 24 గంటల పాటు నాణ్యమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారం, విద్యార్థుల సంక్షేమం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి అనే మూడు అంశాలపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఒకే రోజు దృష్టి సారించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## మందమర్రి పీఎస్‌లో ఏసీపీ కిరణ్ కుమార్ ఆకస్మిక తనిఖీ

- పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలని ఆదేశం!



**ప్రజా వాయిస్ /మంచిర్యాల్ క్రైమ్** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్, మందమర్రి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ వార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఫిర్యాదులు మరియు కేసులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే, సీసీటీఎన్ఎస్‌లో నమోదులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, కోర్టులతో సమన్వయంగా పనిచేసి ఎక్కువ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో భాగంగా స్టేషన్ సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడిన ఏసీపీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల ప్రాథమిక విధి అని గుర్తుచేశారు. సిబ్బంది అందరూ నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ నేరాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పి. రమేష్, ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామగుండంలో నెలరోజుల నిషేధాజ్ఞలు

- మద్యం, డీజే, డ్రోన్లపై ఉక్కుపాదం
- బహిరంగ మద్యం సేవిస్తే కేసులు
- అనుమతి లేని డ్రోన్లు, డీజేలకు చెక్
- ధర్నాలు, ర్యాలీలకూ ముందస్తు అనుమతి తప్పనిసరి
- ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఆంక్షలు
- సీపీ అంబర్ కిషోర్ ఝా



**ప్రజా వాయిస్,మంచిర్యాల :** సాధారణ ప్రజలు, ముఖ్యంగా మహిళల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను మరో నెలపాటు కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రకటించారు. ఆగస్టు 1 ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 1 ఉదయం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలను కఠినంగా అరికట్టనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టమ్‌లు, డ్రోన్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ ఉపయోగించాలంటే సంబంధిత ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.ఇదే కాలంలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. బంద్‌ల పేరుతో సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ప్రజలను బెదిరించడం వంటి చర్యలపై కూడా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్–223తో పాటు హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగింపు ఆదేశాలు సరైనవేనా..?

- ప్రభుత్వ అధికారులే కోర్టులను తప్పు దోవ పట్టించాలని యత్నిస్తున్నారు



**.ప్రజా వాయిస్,సంగారెడ్డి :** కోర్టులు తప్పుదోవ పడుతున్నాయన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు పరోక్షంగా కౌంటర్ ఇచ్చిన న్యాయమూర్తి శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ ప్రాంతంలోని సర్వే నంబర్ 60లోని 350 గజాల తమ భూమిలోకి హైడ్రా అక్రమంగా ప్రవేశించి, ఎలాంటి నోటీసులు లేకుండా ప్రహరీ గోడను కూల్చివేసిందని హైకోర్టును ఆశ్రయించిన సుధారాణి అనే మహిళ ఈ పిటిషన్‌పై గతంలో విచారించగా, తహసీల్దార్ ఆదేశాలతోనే కూల్చివేశామని కోర్టుకు తెలిపిన హైడ్రా కోర్టు ఆదేశాల మేరకు నిన్న కోర్టులో హాజరై, తాను ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, సర్వే నంబర్ 58లోని ప్రభుత్వ భూమి గురించి ఆదేశాలు ఇస్తే, సర్వే నంబర్ 60లోని ప్రైవేట్ భూమిలో కూల్చివేతలు చేపట్టారని తెలిపిన తహసీల్దార్దీంతో ప్రైవేట్ భూమిలోకి అక్రమంగా చొరబడడమే కాకుండా, కోర్టునే తప్పుదోవ పట్టిస్తారా అంటూ హైడ్రాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి "అసలు హైడ్రాకు అంత అత్యుత్సాహం ఎందుకు? నోటీసులు ఇచ్చేవరకు ఆగలేరా? ప్రైవేట్ భూములపై పెత్తనం ఎందుకు? మీ వెనుక ఏదైనా శక్తి ఉండి ఒత్తిడి చేస్తుందా? చట్టవ్యతిరేకంగా కూల్చివేతలు ఎలా చేపడతారు?" అంటూ మండిపాటు హైడ్రా సమాంతర ప్రభుత్వాన్ని నడిపిస్తుందా? ఎవరినీ లెక్క చేయకుండా, కోర్టు ఆదేశాలు కూడా పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేతలు చేపట్టడం ఏంటి? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని సోదర జడ్జి ఇచ్చిన తీర్పును మేము స్వాగతిస్తున్నాము కొందరు నాయకులు కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారు అంటున్నారు, కానీ నిజానికి ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ అధికారులే కోర్టును తప్పుదోవ పట్టించాలని యత్నిస్తున్నారు, న్యాయవ్యవస్థపై అలా మాట్లాడడం సరికాదు అంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు పరోక్షంగా కౌంటర్ ఇచ్చిన న్యాయమూర్తి ప్రస్తుత పిటిషన్ వ్యవహారంలో తదుపరి ఆదేశాల వరకు భూమిలోకి హైడ్రా వెళ్లకూడదని, విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు.

## స్టేషన్ ఘనపూర్ కేంద్రంలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి 5ఎకరాల భూమి

- స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లోని నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే మా లక్ష్యం
- ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిగ్రీ కళాశాల నిర్మాణానికి మార్గం సుగమం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజా వాయిస్/జనగామ** (స్టేషన్ ఘనపూర్)స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో డిగ్రీ కళాశాల నిర్మాణానికి 5ఎకరాల భూమిని కేటాయిస్తూ సంబంధిత అలాట్ మెంట్ కాపీని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాల నిర్మాణానికి మార్గం సుగమం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ ఋణపడి ఉంటారని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గురుకుల పాఠశాలలు, కస్తూరిభా గాంధీ పాఠశాలలు, మాడల్ స్కూల్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్తో పాటు డిగ్రీ కళాశాల కూడా అతి త్వరలోనే స్వంత భవనంలో అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు రానున్న రోజులల్లో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని విద్యా హబ్ తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.

## రోడ్డుపైనే మురికి మడుగు.. కొత్తగూడెంలో ప్రజల నరకయాతన..!

- డ్రైనేజీ నీరు ఏళ్లుగా రోడ్డుమలుపులోనే నిల్వ
- దుర్వాసనతో వాహనదారులు, గ్రామస్తులకు చుక్కలు
- కార్యదర్శి, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..
- సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉందని ఆందోళన

**ప్రజా వాయిస్,అనంతగిరి:**సూర్యాపేట జిల్లా, అనంతగిరి మండలంలోని కొత్తగూడెం గ్రామంలో డ్రైనేజీలోకి వెళ్లాల్సిన మురికి నీరు రోడ్డు మూలమలుపులోనే ఏళ్లుగా నిల్వ ఉండటంతో గ్రామం దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మురుగునీరు నిలిచిపోవడంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి రాకపోకలకు ఆటంకం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో ఈ సమస్య ఎన్నేళ్లుగా కొనసాగుతున్నప్పటికీ గ్రామ కార్యదర్శి సహా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు తీవ్ర స్థాయిలో ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఇదే పరిస్థితి ఉండేదని, ప్రభుత్వం మారినా అధికారుల నిర్లక్ష్యం మాత్రం మారలేదని మండిపడుతున్నారు.ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని గ్రామస్తులు పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.






## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు..!

- రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను సీఎం వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలి
- సూర్యాపేట ధర్నాలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్

**ప్రజా వాయిస్,సూర్యాపేట:** సూర్యాపేట పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ యువజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిర్వహించిన ధర్నాలో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సంక్షేమాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం బాధ్యతను పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందక ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపకుండా ఒత్తిళ్లు, బెదిరింపులకే పరిమితమవుతోందని విమర్శించారు.పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తుంటే, ఫీజుల కోసం విద్యార్థులను కళాశాలలు ఇబ్బంది పెట్టే పరిస్థితి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వచ్చిందన్నారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి ఆధీనంలోనే ఉన్నప్పటికీ విద్యార్థులు తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఇంజినీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బొల్లం మల్లయ్య యాదవ్, విద్యార్థులను అవమానించేలా మాట్లాడటం బాధ్యతారాహిత్యమని అన్నారు. చదువుకుని ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతను కించపరిచే వ్యాఖ్యలు తగవని, వాటిని వెంటనే వెనక్కి తీసుకుని రాష్ట్ర విద్యార్థులకు, యువతకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నాలుగేళ్ల నిరీక్షణకు న్యాయం చేయాలి

- కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థుల వయో పరిమితి పెంచండి
- పోస్టుల సంఖ్య పెంపుతో పాటు వయో సడలింపునకు ప్రభుత్వాన్ని కోరిన అభ్యర్థులు
- తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం

**ప్రజా వాయిస్,జనగామ:** కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల భర్తీలో అభ్యర్థులకు వయోపరిమితి సడలింపుతో పాటు పోస్టుల సంఖ్యను పెంచాలని కోరుతూ శుక్రవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, టీఆర్పీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం అందజేశారు. కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో కలిసి మాదిగ మేధావుల ఫోరం జనగామ జిల్లా అధ్యక్షుడు గొంగళ్ల కుమార్ ఆధ్వర్యంలో యాసారపు కరుణాకర్ ఈ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా యాసారపు కరుణాకర్ మాట్లాడుతూ.. 2022లో పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత మళ్లీ 2026లోనే నోటిఫికేషన్ రావడంతో వేలాది మంది నిరుద్యోగ యువత నాలుగేళ్ల విలువైన సమయాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా వయోపరిమితి దాటిన అభ్యర్థులకు ప్రత్యేక సడలింపు కల్పించడంతో పాటు పోస్టుల సంఖ్యను కూడా పెంచేలా ప్రభుత్వం వెంటనే జీఓ జారీ చేయాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం, డాక్టర్ కల్నల్ భిక్షపతి, చెరుకూరి మౌనిక, ముక్క విష్ణు, గుజ్జుక రాజు తదితరులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్ ముందడుగు

- యాద్గారిపల్లిలో లైబ్రరీ, స్పోర్ట్స్ రూమ్ ప్రారంభం
- నిరుపయోగంగా ఉన్న గదిని ఆధునిక లైబ్రరీ, స్పోర్ట్స్ రూమ్‌గా తీర్చిదిద్దిన సర్పంచ్
- విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేసిన దాత గాయం ఉపేందర్ రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

**మిర్యాలగూడ, ప్రజా వాయిస్.** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యాద్గారిపల్లిలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన లైబ్రరీ గది, స్పోర్ట్స్ రూమ్‌ను శనివారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి స్వచ్ఛంద చొరవతో పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న తరగతి గదిని మరమ్మతులు చేయించి, అందంగా రంగులు వేయించి విద్యార్థుల వినియోగానికి అనువుగా లైబ్రరీ, స్పోర్ట్స్ రూమ్‌గా అందుబాటులోకి తీసుకువచ్చారు.అదే విధంగా పాఠశాల క్రీడా మైదానానికి అవసరమైన మట్టిని తెప్పించి చదును చేయించడంతో విద్యార్థులకు మెరుగైన క్రీడా వాతావరణం కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల క్రీడా నైపుణ్యాల అభివృద్ధికి అవసరమైన స్పోర్ట్స్ మెటీరియల్‌ను దాత గాయం ఉపేందర్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల చదువు, మౌలిక వసతులు, క్రీడల అభివృద్ధికి అవసరమైన ఏ పనికైనా తాను ముందుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలను అన్ని విధాలుగా బలోపేతం చేసి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావూరి బాలుతో పాటు ఉపాధ్యాయులు, గ్రామ వార్డు సభ్యులు వెంకన్న, రామకృష్ణ, సురేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు, విద్యార్థులు సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, దాత గాయం ఉపేందర్ రెడ్డిల సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. "విద్య కోసం చేసే ప్రతి సేవ సమాజ భవిష్యత్తుకు వేసే బలమైన పునాది" అని పలువురు పేర్కొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి

- లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదు
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్
- జిల్లా టీయూడబ్ల్యూజే నూతన అడహాక్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక






జిల్లా టీయూడబ్ల్యూజే నూతన అడహాక్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజావాయిస్/వికారాబాద్:**జర్నలిస్టుల సంక్షేమం, ముఖ్యంగా ఇళ్ల స్థలాల సాధన కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్143) ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో టీయూడబ్ల్యూజే జిల్లా అడహాక్ కమిటీ కన్వీనర్ ఆసీఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో జిల్లా సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి వికారాబాద్, కోడంగల్, పరిగి, తాండూర్ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపును ప్రభుత్వం అత్యవసరంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం విచారకరమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.అనంతరం జరిగిన సమావేశంలో టీయూడబ్ల్యూజే సంస్థ బలోపేతం, సభ్యత్వ విస్తరణ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, జిల్లా వ్యాప్తంగా మండల మరియు డివిజన్ స్థాయి కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి యేగానంద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు తిరుపతి నాయక్, జిల్లా నాయకులు రవీందర్, ఆసీఫ్ హుస్సేన్, ప్రహ్లాదాచారి, శ్రీనివాస్, నర్సిములు, ఆనంద్, జావీద్, రాజు, బస్వరాజ్, సంతోష్, మల్కయ్య గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్ 143) వికారాబాద్ జిల్లా నూతన అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా కన్వీనర్‌గాఎం. ర వీంద ర్, కో– క న్వీన ర్లుగా: ప్రహ్లాదాచారి, శ్రీనివాస్, నర్సిములు, ఆనంద్, జావీద్, రాజు, బస్వరాజ్, సంతోష్, మల్కయ్య గౌడ్, కృష్ణ, రాజేందర్ గౌడ్లను జిల్లా జర్నలిస్టులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా టీయూడబ్ల్యూజేను మరింత బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సభ్యత్వ విస్తరణ, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది.



# వానల ముప్పుకు జిల్లా యంత్రాంగం అలర్ట్

- భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలతో అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ కీలక ఆదేశాలు
- వాగులు, వంకలు, కాజ్‌వేల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- లోతట్టు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు సిద్ధం చేయాలి
- ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే లక్ష్యంగా ముందస్తు చర్యలు

**ప్రజా వాయిస్, సంగారెడ్డి:** రాష్ట్రంలో కొనసాగుతున్న వాతావరణ మార్పులు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో వచ్చే వారంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి వివిధ శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షించారు.ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని, మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠంగా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, కాజ్‌వేలు, కాలువల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట పోలీసు బందోబస్తు కల్పించాలని ఆదేశించారు.లోతట్టు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని, శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాత భవనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలు, సీజనల్ వ్యాధుల నివారణ, పట్టణాల్లో డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు సూచించారు.

# రైస్ మిల్లుపై విజిలెన్స్ మెరుపుదాడి

- సీఎంఆర్ ధాన్యం నిల్వలు, రికార్డులపై క్షుణ్ణ పరిశీలన
- అక్రమాల కోణంలో తనిఖీలు

**ప్రజా వాయిస్, సుల్తానాబాద్:** సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం నిల్వలు, మిల్లింగ్ రికార్డుల్లో ఏవైనా అక్రమాలు జరిగాయా అనే కోణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం సుల్తానాబాద్ పట్టణ శివారులోని ఓ రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బస్వారెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో సీఎంఆర్ ధాన్యం నిల్వలు, పౌరసరఫరాల శాఖ కేటాయించిన ధాన్యం, మిల్లింగ్ అనంతరం ప్రభుత్వానికి అప్పగించిన బియ్యం పరిమాణానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ధాన్యం నిల్వలు, స్టాక్ వివరాలు, రిజిస్టర్లు, సంబంధిత పత్రాలను సరిపోల్చి ఎక్కడైనా వ్యత్యాసాలు ఉన్నాయా అనే అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.ఈ తనిఖీల్లో కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సీతారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు అనిల్, ప్రశాంత్, వరుణ్, డిప్యూటీ తహసీల్దార్ దినేష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.





# బెల్లంపల్లి బస్టాండ్‌లో భారీ గుంత ..నిద్రలో అధికారులు

- ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు..తక్షణ చర్యలకు డిమాండ్
- స్పందించకపోతే ఆందోళన తప్పదని టీడీపీ, కార్మిక సంఘాల హెచ్చరిక

**ప్రజా వాయిస్, బెల్లంపల్లి టౌన్** :భారీ వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి కన్నాల బస్తీ సమీపంలోని కొత్త బస్టాండ్ మధ్యలో భారీ గుంత ఏర్పడి ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తోంది. ప్రతిరోజూ హైదరాబాద్, మహారాష్ట్రతో పాటు బెల్లంపల్లి నియోజకవర్గంలోని పలు మండలాలకు వెళ్లే బస్సులు, విద్యార్థులు, ఉద్యోగులు ఈ బస్టాండ్‌ను వినియోగిస్తున్నందున ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఈ ప్రాంతంలో అండర్‌గ్రౌండ్ గనుల తవ్వకాల ప్రభావంతోనే భూకుంగుదల జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. ఆర్టీసీ, రెవెన్యూ, సింగరేణి అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి గుంతను పూడ్చడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, అవసరమైతే తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.ప్రజల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అధికారులు తక్షణమే స్పందించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు టి. మణిరాం సింగ్, నాయకులు గజ్జల దుర్గయ్య, ఆర్. హరిబాబు, పోచమల్లు తదితరులు హెచ్చరించారు.

# ప్రభుత్వ వైద్య సేవలకు మరో గౌరవం

- పీహెచ్‌సీలో ఒకే నెలలో 17 సాధారణ ప్రసవాలు
- ప్రజల విశ్వాసానికి ప్రతిబింబంగా నిలిచిన శంకరంపేట–ఏ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- ఆశాలు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సుల సమిష్టి కృషితో అరుదైన ఘనత
- మాతా–శిశు ఆరోగ్య సేవల్లో ప్రభుత్వ ఆస్పత్రి మరో ముందడుగు
- ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన సేవలు అందిస్తాం : డా. షర్ఫుద్దీన్

**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆస్పత్రులు సత్తా చాటుతున్నాయనే విషయాన్ని పెద్ద శంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరోసారి నిరూపించింది. ఒకే నెలలో 17 సాధారణ ప్రసవాలను విజయవంతంగా నిర్వహించి పీహెచ్‌సీ అరుదైన మైలురాయిని నమోదు చేసింది. ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఇది నిదర్శనమని వైద్యాధికారి డా. షర్ఫుద్దీన్ తెలిపారు.నెలవారీ సమీక్ష సమావేశంలో ఈ విజయాన్ని వైద్య సిబ్బందితో కలిసి పంచుకున్న ఆయన, ఈ ఘనత ఒక్కరి కృషి కాదని, క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తున్న ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు సమిష్టిగా పనిచేయడం వల్లే సాధ్యమైందన్నారు. గర్భిణులను ముందస్తుగా గుర్తించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, ఆస్పత్రి ప్రసవాలపై అవగాహన కల్పించడం, ప్రసవ సమయానికి సకాలంలో ఆస్పత్రికి తరలించడం వంటి అంశాల్లో వైద్య బృందం సమన్వయంతో పనిచేసిందని వివరించారు.సురక్షిత మాతృత్వానికి సాధారణ ప్రసవాలే ఉత్తమ మార్గమని, అందుకే గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకునేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని డా. షర్ఫుద్దీన్ తెలిపారు. ఈ ఫలితంతో తమ బాధ్యత మరింత పెరిగిందని, భవిష్యత్తులో మరింత మెరుగైన లక్ష్యాలను నిర్దేశించుకుని మాతా–శిశు ఆరోగ్య సేవలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలు నమ్మకంతో ముందుకు రావడం ఆనందదాయకమని, అదే విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీ సిబ్బంది నిరంతరం అంకితభావంతో పనిచేస్తారని ఆయన స్పష్టం చేశారు.






# మంథని ఎస్సీ బాలికల హాస్టల్‌పై మళ్లీ మూసివేత నీడ

- వసతి గృహం, సహాయ సంక్షేమ శాఖాధికారి కార్యాలయం మంథనిలోనే కొనసాగించాలంటూ శ్రీధర్‌బాబుకు ఎస్ఎఫ్ఐ వినతి
- చేరికలు నిలిపివేసి హాస్టల్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు

**ప్రజా వాయిస్,మంథని:**మంథనిలోని పట్టిక కులాల (ఎస్సీ) బాలికల వసతి గృహం, సహాయ సంక్షేమ శాఖాధికారి కార్యాలయాన్ని యథావిధిగా మంథనిలోనే కొనసాగించాలని కోరుతూ భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నాయకులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ, విద్యార్థి ఉద్యమాల ఫలితంగానే మంథనిలో ఎస్సీ బాలికల వసతి గృహం ఏర్పాటైందని గుర్తు చేశారు. గతంలో హాస్టల్‌ను మూసివేసే ప్రయత్నాలను విద్యార్థి సంఘం అడ్డుకుని కాపాడిందని పేర్కొన్నారు. విద్యార్థినుల సౌకర్యార్థం ప్రత్యేక వార్డెన్‌ను నియమించాలని చేసిన డిమాండ్‌కు స్పందించిన ప్రభుత్వం కొత్త సంరక్షకురాలిని నియమించిందని తెలిపారు.అయితే ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన సంరక్షకురాలు కొత్త చేరికలను స్వీకరించకుండా వివిధ కారణాలు చెబుతూ వసతి గృహాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హాస్టల్‌తో పాటు సహాయ సంక్షేమ శాఖాధికారి కార్యాలయాన్ని కూడా మంథనిలోనే కొనసాగించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబును ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.

# చిన్నారితో మమేకమైన మంత్రి శ్రీధర్ బాబు

- వాహనం ఆపి ఆప్యాయ పలకరింపు
- చదువులో రాణించాలని అక్షయని పటేల్‌కు ఆశీస్సులు

**ప్రజా వాయిస్ , మంథని:**పట్టణంలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిన్నారిపై చూపిన ఆత్మీయత అందరినీ ఆకట్టుకుంది. పలు అభివృద్ధి కార్యక్రమాలకు వెళ్తున్న సమయంలో సీనియర్ రిపోర్టర్ రౌతు సంతోష్ కుమార్తె అక్షయని పటేల్ ఎదురుకావడంతో మంత్రి తన వాహనాన్ని ఆపించారు. చిన్నారిని ప్రేమగా దగ్గరకు తీసుకుని, ఆమె చదువు, బడికి వెళ్తున్న తీరు గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. అధికారిక కార్యక్రమాల మధ్యలోనూ చిన్నారితో కాసేపు మమేకమై చూపిన ఆప్యాయత అక్కడున్న వారిని విశేషంగా ఆకట్టుకుంది. మంత్రి చూపిన ఈ ఆత్మీయతకు స్థానికులు ప్రశంసలు కురిపించారు.



# ఎక్సైజ్ వేలంలో ఏం జరుగుతోంది..?




- స్థానిక మీడియాకు సమాచారం లేకుండానే వాహనాల వేలం
- పారదర్శకతపై అనుమానాలు అధికారుల తీరుపై విమర్శలు
- కొంతమందికే సమాచారం..
- అందరికీ సమాన అవకాశం ఎక్కడ?' అంటూ కర్నే బాబురావు ప్రశ్న

**ప్రజా వాయిస్, మణుగూరు:** మణుగూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లా ఎక్సైజ్ శాఖ నిర్వహించిన స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం ప్రక్రియ చుట్టూ వివాదం ముసురుకుంది. ప్రభుత్వ వేలంపాటకు సంబంధించిన సమాచారాన్ని స్థానిక మీడియాకు సకాలంలో అందించకపోవడంతో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమాచారం కొంతమందికే పరిమితమైందన్న ఆరోపణలు వినిపిస్తుండగా, ప్రభుత్వ నిబంధనల అమలుపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఈ వ్యవహారంపై సామాజిక సేవకులు కర్నే బాబురావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలు నిర్వహించే వేలంపాటల తేదీ, సమయం, నిబంధనలు, వాహనాల పూర్తి వివరాలను ముందుగానే అధికారికంగా ప్రజలకు, స్థానిక మీడియాకు తెలియజేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. కానీ మణుగూరు ఎక్సైజ్ అధికారులు ఆ బాధ్యతను విస్మరించారని విమర్శించారు.ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే ప్రధాన వారధి స్థానిక మీడియానేనని, అలాంటి మీడియాను పక్కనపెట్టి వేలం నిర్వహించడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. గత వేలంపాటల్లోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయనే ఆరోపణలు ఉన్నాయని, ఇకపై వేలం వివరాలను ముందుగానే అధికారికంగా ప్రకటించి, స్థానిక మీడియాతో పాటు అన్ని వర్గాలకు ఒకేసారి సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# బియ్యం, నూనె, పప్పులు, కూరగాయల ధరలకు రెక్కలు

- చుక్కలు చూపిస్తున్న నిత్యావసర వస్తువుల ధరలు
- ఖాళీ అవుతున్న జేబులు




**ప్రజా వాయిస్, హుజూర్ నగర్,** జూలై 31కూరలో ఉప్పు తగ్గినా పర్లేదు గానీ, ధరలు తగ్గితే చాలు అనే పరిస్థితికి వచ్చేసాడు సామాన్యుడు. మార్కెట్ కి వెళ్తే చాలు జేబుకి చిల్లులు పడుతున్నాయి. నిన్నటి వరకు రూ.100 రూపాయలకు తెచ్చుకున్న సరుకుల సంచి, నేడు రూ. 200 పెడితే కానీ నిండటం లేదు.

### బియ్యానికి రెక్కలు... అన్నం మెతుకు బంగారమే!

తెలుగువాడి ప్రాణం అన్నం. అదే ఇప్పుడు భారమైపోయింది. సన్న బియ్యం ధర చూస్తే కళ్ళు బైర్లు కమ్మాల్సిందే. కేంద్రం లెక్కల ప్రకారమే గత నెలతో పోలిస్తే బియ్యం ధర 3.58% పెరిగింది. మార్కెట్లో మాత్రం పరిస్థితి మరీ దారుణం. క్వింటా సన్న బియ్యం ధర గత నెల రూ. 5,200 ఉంటే, ఇప్పుడు రూ. 6,000 దాటేసింది. బాస్మతీ రకం అయితే ఏకంగా 36% వరకు పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. రేషన్ బియ్యం తప్ప, మంచి బియ్యం తినాలంటే జేబు ఖాళీ కావాల్సిందే.

### వంట నూనెలతో కంట తడి... తగ్గేదేలే అంటున్న ఆయిల్ మాఫియా!

పొయ్యి మీద కడాయి పెట్టాలంటేనే భయమేస్తోంది. ఎందుకంటే అందులో పోసే నూనె ధరే మండిపోతోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్, పామాయిల్ ధరలు పెరగడం, రూపాయి విలువ పడిపోవడం, పశ్చిమాసియా యుద్ధాలతో షిప్పింగ్ ఖర్చులు పెరగడం కారణంగా నూనె ధరలు భగ్గుమంటున్నాయి. సన్ ఫ్లవర్ ఆయిల్, వేరుశనగ నూనె ధరలు ఏకంగా 9.45% నుండి 9.89% పెరిగాయి. 15 లీటర్ల టిన్ నూనె గత నెల రూ. 1,900–2,050 ఉంటే, ఇప్పుడు ఏకంగా రూ. 2,480 – రూ. 2,740 కి ఎగబాకింది. అంటే ఒక్కసారిగా టిన్ మీద రూ. 600 వరకు భారం.పూరీలు, బజ్జీలు, పకోడీలు ఇక హోటళ్లలో కూడా కొండెక్కుతున్నాయి. ఇంట్లో పూరీ వండాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి.

### ఘాటెక్కిస్తున్న మిర్చి... కారం ముట్టుకుంటే కరెంట్ షాకే!

ఇక అసలు సినిమా మిర్చి దగ్గరే ఉంది. తెలుగు రాష్ట్రాల్లో పండే పంట తగ్గి మార్కెట్లలో డిమాండ్ పెరగడంతో మిర్చి ధరలు చుక్కలనంటుతున్నాయి. పచ్చి మిర్చి కిలో రూ. 350 దాటేసింది. త్వరలో రూ. 400 కి చేరుతుందని అంచనా. మార్కెట్లో ఎండు మిర్చి క్వింటాల్ ధర రూ. 13,000 పైనే ఉంది. డబ్బీ మిర్చి అయితే రికార్డు స్థాయిలో క్వింటాల్ కి రూ. 55,200 పలికింది. మిర్చి కొనాలంటే బంగారం కొన్నట్టే ఉంది. కారం తక్కువ వేసి వంట చేస్తున్నాం. పిల్లలు తినట్లేదు, మేము భరించలేకపోతున్నాం అంటూ గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పచ్చి మిర్చి, అల్లం వాడకం హోటళ్లు, హాస్టళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కూడా తగ్గించేశారు. కారం లేని కూర, నూనె లేని వేపుడు, బియ్యం లేని అన్నం ఇదే నేటి సామాన్యుడి దుస్థితి. మొత్తంగా... వర్షాలు సరిగా లేకపోవడం, దిగుమతులపై ఆధారపడటం, పండించే రైతులు ఇతర పంటల వైపు మళ్లడం... అన్నీ కలిసి సామాన్యుడి నెల బడ్జెట్ ను కోత కోస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ధరలను అదుపు చేయకపోతే, వంటిల్లు పూర్తిగా చల్లారే ప్రమాదం ఉంది.

# శిథిలావస్థలో పశువైద్యశాల



- కూలేందుకు సిద్ధంగా 60 ఏళ్ల నాటి భవనం
- ఇబ్బందుల్లో పశుపోషకులు, రైతులు
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పందించాలని 'జనహిత' విజ్ఞప్తి

**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్, పాత మునిసిపాలిటీ ప్రాంతంలో ఉన్న ఏకైక వెటర్నరీ (పశువుల) ఆసుపత్రి తీవ్ర నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరింది. సుమారు 60 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆసుపత్రి భవనం నేడు పూర్తిగా దెబ్బతిని, ఏ క్షణాన కూలిపోతుందో తెలియని ప్రమాదకర స్థితికి చేరుకుంది. సుదూర ప్రాంతాల నుంచి పాడి పశువులకు, జీవాలకు వైద్యం కోసం వచ్చే రైతులకు ఈ ఆసుపత్రి దుస్థితి తీవ్ర నిరాశను కలిగిస్తోంది. వర్షాకాలంలో భవనం కారడం, పారిశుధ్య లోపంతో ప్రాంగణం నిండిపోవడంతో పశువులకు సరైన సమయానికి చికిత్స అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంత పశుపోషకుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానిక శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ తక్షణమే స్పందించాలని 'జనహిత' ప్రతినిధులు కోరుతున్నారు. ఎమ్మెల్యే స్వయంగా ఆసుపత్రిని పరిశీలించి, నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, ఆధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చిరకాల నిరీక్షణకు తెర

- మోసంగి గడపపై ఆగిన హైదరాబాద్ బస్సు
- ఎన్నో ఏళ్ల గ్రామ ప్రజల కల సాకారం
- ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి చేతుల మీదుగా ఘన ప్రారంభం
- విద్య, వైద్యం, ఉపాధి కోసం ప్రయాణించే వారికి భారీ ఊరట
- హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు.




**ప్రజా వాయిస్ – గుర్రంపోడు:**ఎన్నో ఏళ్లుగా గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న కల శుక్రవారం సాకారమైంది. గుర్రంపోడు మండలం మోసంగి గ్రామానికి హైదరాబాద్‌తో నేరుగా అనుసంధానించే ఆర్టీసీ బస్సు సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి పచ్చజెండా ఊపి హైదరాబాద్–మోసంగి, మోసంగి–హైదరాబాద్ బస్సు సర్వీసును ప్రజలకు అంకితం చేశారు. దీంతో రవాణా ఇబ్బందులతో ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలకు పెద్ద ఊరట లభించింది.ఇప్పటి వరకు హైదరాబాద్ వెళ్లాలంటే మధ్యలో బస్సులు మారుతూ, సమయం, డబ్బు వృథా చేసుకోవాల్సి వచ్చేదని గ్రామస్థులు చెబుతున్నారు. కొత్తగా ప్రారంభమైన ఈ నేరుగా బస్సు సేవతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, వైద్య చికిత్స కోసం నగరానికి వెళ్లే రోగులు, సాధారణ ప్రయాణికులందరికీ ప్రయాణం మరింత సులభం కానుంది.ఈసందర్భంగా ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ఈ బస్సు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు.బస్సు ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, యువజన, విద్యార్థి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బస్సు సేవలు ప్రారంభం కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నూతన రవాణా సౌకర్యం మోసంగి గ్రామాన్ని హైదరాబాద్‌తో మరింత చేరువ చేయడమే కాకుండా విద్య, ఉపాధి, వైద్యం, వ్యాపార రంగాలకు కొత్త అవకాశాలను తెరుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# నాగర్‌గూడ ఎక్స్‌రోడ్డుపై బీభత్సం








- ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ
- నలుగురికి తీవ్ర గాయాలు, పలువురికి స్వల్ప గాయాలు
- ప్రయాణికులను ఆస్పత్రికి తరలించిన స్థానికులు

**ప్రజా వాయిస్ ,షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని నాగర్‌గూడ ఎక్స్‌రోడ్డుపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.శంషాబాద్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన లారీ, షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం సమయంలో బస్సులో సుమారు 15 మంది ప్రయాణికులు ఉన్నారు.ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, వాహనదారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను సమీపంలోని నాగర్‌గూడ శ్రీనివాస ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి అత్యవసర వైద్య చికిత్స అందిస్తున్నారు.సమాచారం అందుకున్న షాబాద్ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. రహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సీఎంఆర్ స్కామ్‌లో సంచలనాలు

- మిల్లర్లతో పాటు అధికారులపై కూడా నిఘా..?
- రూ.154 కోట్ల సీఎంఆర్ అక్రమాల గుట్టురట్టు
- మెదక్ కుల్చారంలోనే రూ.7.17 కోట్ల బియ్యం మాయం
- క్రిమినల్ కేసుల భయంతో దిగివస్తున్న మిల్లర్లు
- ప్రతి అవినీతి రూపాయిలో అధికారుల వాటా ఎంత.?
- సమగ్ర దర్యాప్తు జరపాలంటున్న ప్రజలు



**ప్రజా వాయిస్, మెదక్:** తెలంగాణను కుదిపేస్తున్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కుంభకోణం రోజురోజుకూ కొత్త కోణాలను వెలుగులోకి తెస్తోంది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యం మాయమవుతుంటే అది కేవలం మిల్లర్ల చేతనే జరిగిందా లేక పర్యవేక్షణ వ్యవస్థలోనూ భారీ వైఫల్యం ఉందా? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో రాష్ట్రవ్యాప్తంగా అక్రమాల చిట్టా బయటపడుతుండగా, మెదక్ జిల్లా కుల్చారం మండలంలోని సత్యసాయి ఆగ్రో రైస్ ఇండస్ట్రీస్‌లో రూ.7.17 కోట్ల విలువైన 3,029 మెట్రిక్ టన్నుల బియ్యం గల్లంతు కావడం సంచలనం సృష్టించింది.ఒక్క రోజు తనిఖీల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.154 కోట్ల అక్రమాలు బయటపడటం ఈ కుంభకోణం తీవ్రతకు అద్దం పడుతోంది. జగిత్యాలలో రూ.80 కోట్లు, యాదాద్రి భువనగిరిలో రూ.24 కోట్లకు పైగా అక్రమాలు బయటపడటంతో దర్యాప్తు మరింత వేగం అందుకుంది. కేసులు, అరెస్టుల భయంతో పలువురు మిల్లర్లు ప్రభుత్వ బకాయిలు చెల్లించేందుకు ముందుకు వస్తున్నట్లు సమాచారం.

### మిల్లర్లేనా..లేక వ్యవస్థ కూడానా..?

ప్రభుత్వ ధాన్యం కోట్ల రూపాయల విలువతో మిల్లులకు చేరుతుంది. అక్కడి నుంచి బియ్యం ప్రభుత్వ గోదాములకు చేరాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియపై పర్యవేక్షణ బాధ్యత పౌరసరఫరాల శాఖ అధికారులదే. అలాంటప్పుడు వేల టన్నుల బియ్యం గల్లంతవుతుంటే అధికారులు గుర్తించకపోవడం ఎలా ఇదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

### ప్రతి అవినీతి రూపాయిలో వాటా ఎవరిది.?

ప్రజలు, రైతు సంఘాలు ఒకే డిమాండ్ చేస్తున్నారు. మిల్లర్లపై మాత్రమే కాకుండా, వారికి సహకరించిన అధికారులపై కూడా సమగ్ర విచారణ జరపాలి. ప్రతి అవినీతి రూపాయిలో అధికారుల వాటా ఎంత పర్యవేక్షణలో జరిగిన వైఫల్యం నిర్లక్ష్యమా లేక అవినీతా అనే కోణాల్లోనూ ప్రభుత్వం లోతైన దర్యాప్తు చేపట్టాలని కోరుతున్నారు.

### ప్రక్షాళన ఇప్పుడే మొదలుకావాలి

ప్రభుత్వం కేవలం బకాయిలు వసూలు చేయడం లేదా మిల్లర్లపై కేసులు నమోదు చేయడం వద్దే ఆగిపోకుండా, ఈ అక్రమాలకు బాధ్యులైన ప్రతి ఒక్కరిని చట్టం ముందు నిలబెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సివిల్ సప్లై శాఖ నుంచే ప్రక్షాళన ప్రారంభమైతేనే సీఎంఆర్ దందాకు శాశ్వతంగా అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న విజిలెన్స్ దూకుడు ఈ కుంభకోణంలో మరిన్ని సంచలన నిజాలను వెలుగులోకి తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పెద్ద చెరువు కట్టపై భారీ గొయ్యి.. ప్రమాదంలో చెరువు కట్ట...!

- ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని రైతుల ఆందోళన
- మరమ్మతులు చేపట్టాలని రైతుల విజ్ఞప్తి..



**ప్రజా వాయిస్ టేక్మాల్ :**టేక్మాల్ మండలంలోని పెద్ద చెరువు కట్టపై భారీ గొయ్యి ఏర్పడటంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెరువులోకి వరద నీరు భారీగా చేరుతుండటంతో కట్ట బలహీనపడిందని గ్రామస్థులు చెబుతున్నారు.చెరువు కట్టపై ఏర్పడిన గొయ్యి రోజురోజుకూ పెద్దదవుతుండటంతో ఎప్పుడు కట్ట తెగిపోతుందోననే భయం రైతులను వెంటాడుతోంది. ఒకవేళ కట్టకు ఏదైనా నష్టం జరిగితే చెరువులోని నీరు ఒక్కసారిగా దిగువ ప్రాంతాలకు చేరి పంట పొలాలు, రహదారులు, సమీప గ్రామాలకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. పరిస్థితి మరింత విషమించేలోపు నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి అత్యవసర మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.ప్రజల ప్రాణాలు, రైతుల పంటలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి చెరువు కట్టను బలోపేతం చేసి ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## శిథిల పాఠశాలలో చిన్నారుల చదువు ప్రాణాలతో చెలగాటం

- 50 ఏళ్ల నాటి రాళ్లకత్వ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం కూలే దశలో
- వర్షం పడితే పైకప్పు నుంచి జల్లు... గోడలకు భారీ పగుళ్లు
- తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలూ కరువు
- కొత్త భవనం నిర్మించాలని తల్లిదండ్రులు, గ్రామస్తుల వేడుకోలు

**ప్రజా వాయిస్,జిన్నారం:** పటాన్చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపల్ పరిధి రాళ్లకత్వ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల చదువు ప్రాణాలతో చెలగాటంగా మారింది. దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం ప్రస్తుతం కూలే ప్రమాదంలో ఉండటంతో ప్రతి రోజు భయాందోళనల మధ్య చిన్నారులు తరగతులకు హాజరవుతున్నారు.వర్షం కురిసిన ప్రతిసారి పైకప్పు నుంచి నీరు కారుతుండటంతో తరగతి గదులు తడిసి ముద్దవుతున్నాయి.గోడలకు భారీ పగుళ్లు, బలహీనమైన పైకప్పు కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలను పాఠశాలకు పంపాలంటేనే భయంగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల వంటి కనీస మౌలిక వసతులు కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ యువకుడు రాయని బాలేష్ తెలిపారు. ప్రమాదం జరిగే వరకు నిర్లక్ష్యం చేయకుండా స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కౌన్సిలర్, ఎంఈఓ, డీఈఓలు వెంటనే స్పందించి పాఠశాలను పరిశీలించి శిథిల భవనం స్థానంలో కొత్త పాఠశాల భవనం నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# రేషన్ కార్డుదారులకు భారీ ఊరట

- ఈ-కేవైసీ గడువు ఆగస్టు 31 వరకు పొడిగింపు
- వర్షాలు, సాంకేతిక సమస్యలతో ప్రభుత్వ కీలక నిర్ణయం
- త్వరగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచన



**మిర్యాలగూడ,హైదరాబాద్.**రాష్ట్రంలోని లక్షలాది రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు విధించిన గడువును ఆగస్టు 31 వరకు పొడిగించింది. వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడటం, సర్వర్ సమస్యలతో అనేక మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేయలేకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ సూచించింది.గత కొన్ని రోజులుగా ఈ-కేవైసీ కేంద్రాల వద్ద భారీ రద్దీ నెలకొనడంతో పాటు బయోమెట్రిక్ నమోదు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, దూర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వానికి పెద్దఎత్తున వినతులు అందాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వం గడువు పొడిగింపునకు ఆమోదం తెలిపింది.ఈ-కేవైసీని సమీపంలోని రేషన్ దుకాణాలు, మీ సేవా కేంద్రాలు, పౌరసరఫరాల సేవా కేంద్రాల్లో పూర్తి చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. వేలిముద్రలు పనిచేయని సందర్భాల్లో ఐరిస్ స్కానింగ్ ద్వారా ధృవీకరణ చేపట్టాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ (e-PoS) యంత్రాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డీలర్లను ఆదేశించిన ప్రభుత్వం, గడువు ముగిసే వరకు వేచి ఉండకుండా వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

**ముఖ్యాంశాలుఈ-కేవైసీ గడువు:**

ఆగస్టు 31 వరకులబ్ధిదారులకు మరో నెల అవకాశం

వర్షాలు, సర్వర్ సమస్యలతో గడువు పెంపు

రేషన్ దుకాణాలు, మీ సేవా కేంద్రాల్లో సేవలు

వేలిముద్రలు పనిచేయకపోతే ఐరిస్ ద్వారా ధృవీకరణ



## బురద రోడ్లల్లో బోనాలు ఎట్ల తీసేది..?

- జాగో తెలంగాణ రాష్ట్ర నాయకులు రాములు నేత డిమాండ్

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** పట్టణంలోని హమాలి కాలనీలో గల పెద్దమ్మ గుడికి శాంతి నగర్, ఐడిఎస్ ఎంటి కాలనీ, హమాలి కాలనీ ప్రజలు ఆదివారం నాడు పెద్దమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాలు తీయడం జరుగుతుంది. కావున బోనాలు తీయడానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలతో కూడిన బురద రోడ్ల నుండి అపరిశుభ్ర మురికి కాలువల పక్కనుండి బోనాలు తీయాల్సిన పరిస్థితి ఎదురవుతుందని, వాస్తవానికి వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రత కొరకు తెలంగాణ ప్రభుత్వం పురపాలక సంఘాలకు కోట్లాది రూపాయలు నిధులను విడుదల చేసిన జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హమాలి కాలనీ ప్రధాన మైన రోడ్డు శుభ్రత లేకపోవడం శోచనీయం బాధాకరంమని రాములు నేత కోరారు. అంతేకాకుండా పెద్దమ్మ తల్లి దేవాలయంకు వెళ్లే ప్రధానమైన రోడ్డు బుర్దమయంగా ఉన్నందున చిన్నపిల్లలు వృద్ధులు వికలాంగులు ఆ రోడ్డు గుండా వెళ్లాలి అంటే జారీ పడతారని అన్నారు. కావున వెంటనే మొరంగాని, లేదా సన్నటి కంకర లాంటిది వేసి పండుగను పరిశుభ్రత వాతావరణంలో సామాన్య ప్రజలకు ఇబ్బందులు జరగకుండా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని జాగో తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులు రాములు నేత కోరారు..

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలి
- బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్



**నల్గొండ, ప్రజా వాయిస్:** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక దృష్టి సారించాలని బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యాశాఖ మంత్రిని ఆలస్యం చేయకుండా నియమించాలని ఆయన కోరారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కళాశాలల్లో చదువులు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోందని, పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనలకు మద్దతు తెలపడం మంచి పరిణామమేనని పేర్కొన్న ఆయన, అదే సమయంలో తెలంగాణ విద్యార్థుల సమస్యలపై కూడా ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని విద్యార్థుల బాధలను ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయకపోతే రాష్ట్రంలో మరోసారి యువత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చెలరేగే అవకాశం ఉందని సురేష్ యాదవ్ హెచ్చరించారు.అదేవిధంగా, రాష్ట్ర మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి విద్యారంగానికి సమర్థ నాయకత్వం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలని, ఆలస్యం చేస్తే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## చెక్‌పోస్ట్‌లో 'చేయి' కానిస్టేబుల్‌కు సస్పెన్షన్

- సలాబత్పూర్ అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ లో అక్రమ వసూళ్ల ఆరోపణలు
- వైరల్ వీడియోతో కదిలిన ఎక్సైజ్ శాఖ
- కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిపై వేటు
- నిర్లక్ష్య విధులు, బాధ్యతా రాహిత్యంపై కఠిన చర్యలు తప్పవన్న జిల్లా ఎక్సైజ్ అధికారి



**ప్రజావాయిస్, కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** మహారాష్ట్ర,తెలంగాణ సరిహద్దులోని సలాబత్పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌లో అక్రమ వసూళ్ల ఆరోపణలు ఎక్సైజ్ శాఖలో కలకలం రేపాయి. చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ బి. సుధాకర్‌రెడ్డి వాహనాల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో పాటు, ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం తీవ్ర చర్చకు దారితీసింది.ఈ ఘటనపై విచారణ చేపట్టిన కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారి ముకుంద్‌రెడ్డి నివేదికను ఉన్నతాధికారులకు పంపగా, అందులో పేర్కొన్న అంశాల ఆధారంగా కానిస్టేబుల్ బి. సుధాకర్‌రెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌ను జిల్లా ఎక్సైజ్ అధికారి ముకుంద్‌రెడ్డి ధృవీకరించారు.సలాబత్పూర్ వంటి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో అత్యంత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందని, విధుల్లో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖ ఎలాంటి ఉపేక్ష చూపదని ముకుంద్‌రెడ్డి హెచ్చరించారు. శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై ఇకపై కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.




## కేక్‌కు బదులు కరుణ అనాథ చిన్నారులతో జన్మదిన వేడుక

- హయత్ నగర్ సుధీర్ ఫౌండేషన్ లో 150 మంది చిన్నారులతో భోజనం చేసిన బీజేపీ యువ నాయకుడు ప్రవీణ్ కుమార్
- నోట్ బుక్స్, స్టేషనరీ, చాక్లెట్లు పంపిణీ సేవే నిజమైన సంబరమని సందేశం

ప్రజా వాయిస్,హయత్‌నగర్:ఆర్భాటాలకు దూరంగా, సేవా కార్యక్రమంతో జన్మదినాన్ని అర్థవంతంగా జరుపుకోవచ్చని బీజేపీ యువ నాయకుడు ప్రవీణ్ కుమార్ నిరూపించారు. హయత్‌నగర్‌లోని సుధీర్ ఫౌండేషన్ అనాథాశ్రమంలో తన జన్మదిన వేడుకలను నిర్వహించిన ఆయన, అక్కడ ఆశ్రయం పొందుతున్న 150 మంది చిన్నారులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వారికి నోట్‌బుక్స్, పెన్సిళ్లు, ఇతర స్టేషనరీ సామగ్రితో పాటు చాక్లెట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా చిన్నారులను ఉద్దేశించి మాట్లాడిన ప్రవీణ్ కుమార్, మీ పరిస్థితులు కాదు మీ కృషి, క్రమశిక్షణ, విద్య పట్ల అంకితభావమే మీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి.ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలి. సమాజానికి ఆదర్శంగా ఎదగాలి అని ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు.పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాలను ఆర్భాటాలకు కాకుండా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తే ఎంతో మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఆయన పేర్కొన్నారు. పుట్టినరోజు అంటే కేక్ కట్ చేయడం మాత్రమే కాదు ఒక చిన్నారి ముఖంలో చిరునవ్వు తీసుకురావడమే నిజమైన వేడుక అని అన్నారు.ఈ కార్యక్రమంలో సునీల్, రామ్‌రెడ్డి, శేఖర్, పరమేశ్వర్, బిట్టు, ఉదయ్, సాయి తదితరులు పాల్గొన్నారు. చిన్నారులకు అందించిన సహాయానికి సుధీర్ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రవీణ్ కుమార్‌తో పాటు సేవా కార్యక్రమంలో భాగమైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## వాన దెబ్బకు నేలమట్టమైన ఇల్లు

- దౌల్తాబాద్ మండలం మాచినపల్లిలో ఘటన
- ఎల్-1 జాబితాలో ఉన్న నరసింహ చారికి ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని విజ్ఞప్తి
- అర్హతపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అధికారుల హామీ

**ప్రజా వాయిస్, దౌల్తాబాద్:**దౌల్తాబాద్ మండలం మాచినపల్లి గ్రామంలో భారీ వర్షాలు ఓ కుటుంబాన్ని నిలువునా దెబ్బతీశాయి. గ్రామానికి చెందిన కమ్మరి నరసింహచారి నివాసం శుక్రవారం ఉదయం ఒక్కసారిగా కూలిపోవడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు.అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చినా, ఇంట్లోని గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి.సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు కోరారు. కాగా, ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ గృహాల ఎల్-1 జాబితాలో నరసింహచారి పేరు ఉన్నందున వెంటనే ఇల్లు మంజూరు చేయాలని కుటుంబ సభ్యులు అధికారులను విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు నరసింహచారి ఇందిరమ్మ గృహానికి అర్హుడని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని హామీ ఇవ్వడంతో బాధిత కుటుంబానికి కొంత ఊరట లభించింది.






## ప్రపంచ పర్యాటక కేంద్రానికి.. బస్‌స్టాప్ కరువు

- విపస్యన ధ్యాన కేంద్రం వద్ద ఆర్టీసీ బస్ స్టాప్ లేక పర్యాటకులు, బౌద్ధ బిక్షువుల నానా అవస్థలు
- ప్రధాన ద్వారం వద్ద శాశ్వత బస్ స్టాప్ ఏర్పాటు చేసి అన్ని బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్
- పర్యాటకాభివృద్ధికి ప్రజా రవాణా సౌకర్యాలే కీలకమని అభిప్రాయం

**ప్రజా వాయిస్ / నల్గొండ క్రైమ్:** ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నాగార్జునసాగర్ బుద్ధవనం, విపస్యన ధ్యాన కేంద్రానికి చేరుకునే సందర్శకులు ఆర్టీసీ బస్‌స్టాప్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు దేశ విదేశాల నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో బౌద్ధ బిక్షువులు, పర్యాటకులు, ధ్యాన సాధకులు ఇక్కడికి వస్తున్నా, అధికారిక బస్‌స్టాప్ లేకపోవడంతో బస్సులు ఆగడం లేదు. దీంతో దూరంలో దిగి సామానుతో నడుచుకుంటూ కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విదేశీ పర్యాటకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పొడవునా ధ్యాన శిబిరాలు జరిగే ఈ ప్రాంతానికి ప్రజా రవాణా సౌకర్యాలు కల్పించడం అత్యవసరమని పేర్కొంటున్నారు.జిల్లా ఆర్టీసీ అధికారులు స్పందించి బుద్ధవనం,విపస్యన ధ్యాన కేంద్రం ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద శాశ్వత బస్‌స్టాప్ ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ముఖ్య బస్సులు అక్కడ ఆగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చర్యతో పర్యాటకులకు సౌకర్యం కలగడమే కాకుండా నాగార్జునసాగర్ పర్యాటకాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

# భారీ వర్షాలలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- రైల్వే స్టేషన్, ఆస్పత్రి పెద్ద చెరువు ల వద్ద అప్రమత్తంగా ఉండాలి
- ముందస్తు జాగ్రత్తలపై బాధితులకు సూచనలు
- ప్రజల ప్రాణ రక్షణకె ప్రాధాన్యం
- భారీ వర్షాల ప్రాంతాలను పరిశీలించిన కామారెడ్డి కలెక్టర్

**ప్రజా వాయిస్ కామారెడ్డి జిల్లా ప్రతినిధి:**



భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల అధికారు లు సమన్వయంతో పనిచేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కామారెడ్డి పట్టణం భారీ వర్షాల ప్రాంతాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై గత కొన్ని రోజులుగా నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రి ఆవరణలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
భారీ వర్షాలతో పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు ప్రవహిస్తున్న నేపథ్యంలో చెరువు వద్ద సంప్రదాయ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చెరువు పరిసరాలను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లవద్దని జాలర్లను హెచ్చరించారు. ప్రజలు ప్రమాదవశాత్తు చెరువు వైపు వెళ్లకుండా తగిన బారికేడ్లు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు. గత ఏడాది కుండపోత వర్షాలకు దెబ్బతిన్న జీఆర్ కాలనీలో పర్యటించిన కలెక్టర్ అక్కడి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.
జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ: ప్రజల ప్రాణ భద్రతే జిల్లా యంత్రాంగం తొలి ప్రాధాన్యం. భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలి. నీటి నిల్వలు, చెరువులు, కాలువలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి. ప్రజలు కూడా నిర్లక్ష్యం చేయకుండా అధికారుల సూచనలను పాటించి అప్రమత్తంగా ఉండాలి. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, మున్సిపల్ చైర్పర్సన్ ఇప్పు ఉమారాణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ టి. పర్వతాలు, తహసీల్దార్ హిమబిందు, కౌన్సిలర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ఎన్. హన్మంతరావు నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి ఎ. వినీత్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సి.హెచ్. వేణుప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వీపనగండ్ల మండల ఉప సర్పంచ్‌ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

- మండల అధ్యక్షుడిగా మోజర్ల నాగముని, ఉపాధ్యక్షురాలు జుర్రు చెన్నమ్మ, ఏకగ్రీవంగా ఎన్నిక



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా :**

వనపర్తి జిల్లావీపనగండ్ల మండల కేంద్రంలో ఉప సర్పంచ్‌ల సంఘం మండల కమిటీ ఎన్నిక జిల్లా అధ్యక్షుడు బాలపీరు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.నూతన కమిటీలో మండల అధ్యక్షుడిగా సంపత్‌రావుపల్లి ఉప సర్పంచ్ మోజర్ల నాగముని, ఉపాధ్యక్షులుగా పుల్గర్‌చర్ల ఉప సర్పంచ్ జుర్రు చెన్నమ్మ బొల్లారం ఉప సర్పంచ్ వేముల శ్రీనివాస్ గౌడ్, గౌరవ సలహాదారుగా గోపాల్‌దిన్నె ఉప సర్పంచ్ వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శిగా సంగినేనిపల్లి ఉప సర్పంచ్ ఉడుత శిరీష, కార్యదర్శులుగా కల్వరాల గ్రామ ఉప సర్పంచ్ తడకల రంగమ్మ, నాగర్లబండ తాండ ఉప సర్పంచ్ రవి, కోశాధికారిగా రంగవరం ఉప సర్పంచ్ బోరెల్లి కురుమయ్య ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి గణేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగులాలి తదితరులు పాల్గొన్నారు.అనంతరం నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులను జిల్లా కమిటీ ప్రతినిధులు, మండల ఉప సర్పంచ్‌లు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మండలంలోని ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజలకు అప్రమత్తంగా ఉండాలి, తహసిల్దార్, ఎస్సై



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా :**
ప్రస్తుతం వీపనగండ్ల మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మండల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని కోరిన తహసీల్దార్ ఎండి ఖజా మైనుద్దీన్, ఎస్సై జె నరేష్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,,,వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు, కాలువలు ప్రమాదకర స్థాయిలో ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరం లేకుండా వాటిని దాటేందుకు ప్రయత్నించరాదు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి,తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాల ప్రజలు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి అని అన్నారు. అలాగే పాత శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారు ప్రత్యేక అప్రమత్తతతో ఉండాలి రైతులు ఉరుములు, మెరుపులు సంభవిస్తున్న సమయంలో పొలాల్లో పనిచేయకుండా సురక్షిత ప్రదేశాల్లో ఉండాలి అలాగే చెట్ల కింద నిలబడకూడదు. పశువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి,తల్లిదండ్రులు చిన్నారులను వర్షపు నీటిలో ఆడుకోవడానికి లేదా వాగులు, చెరువుల వద్దకు వెళ్లడానికి తగు జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. అలాగే విద్యుత్ తీగలు తెగిపడి కనిపించినా లేదా విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి,అత్యవసర పరిస్థితుల్లో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, వైద్య, విద్యుత్ శాఖ అధికారులను వెంటనే సంప్రదించి అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ కొడకండ్ల టౌన్ 4 వ సంవత్సరా ప్రమాణ స్వీకారోత్సవం

- ఈ సంవత్సరం పదిమంది సభ్యులను నూతనంగా చేర్చాం.
- లయన్స్ క్లబ్ తరపున నిరుపేద కుటుంబానికి 60 వేల రూపాయల చెక్కును అందించాం.
- అధ్యక్షులుగా పసునూరి మధుసూదన్

**ప్రజా వాయిస్/జనగామ జిల్లా (కొడకండ్ల)**

జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొడకండ్ల 2026-27 సంవత్సరానికి నూతన అధ్యక్షులు పసునూరి మధుసూదన్, సెక్రెటరీ.విశ్వనాధుల.గ్యానేశ్వర చారి, ట్రెజర్.పసునూరి. నవీన్ కుమార్ ఏకగ్రీవం ఎన్నికై సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం.డిస్టిక్ గవర్నర్ యన్.సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేస్తూ బాధ్యతలు తీసుకోవడం జరిగినది.ఈ సంవత్సరం 10 మంది సభ్యులు నూతనంగా చేర్పించడం జరిగింది. సేవా కార్యక్రమాలలో భాగంగా మొదటగా మన కొడకండ్ల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన జవ్వాజి.సంజన తండ్రి కీ.శే.సాయిలు,సులోచన కు ఉన్నత విద్యను అభ్యసించడానికి లయన్స్ క్లబ్ ఆఫ్ కొడకండ్ల టౌన్ తరపున రూ.60.000 రూపాయల చెక్కు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మాజీ లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు, ఇన్స్టలేషన్ అధికారి ,లయన్స్ సభ్యులు పాల్గొన్నారు




## పెద్దపల్లి ఎమ్మార్వోకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం వినతి...

- స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్
- జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మల్యాల సంజీవ్ గౌడ్.



ప్రజా వాయిస్, పెద్దపల్లి : రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మల్యాల సంజీవ్ పెద్దపల్లి ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మల్యాల సంజీవ్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. సుమారు రూ.8,000 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయని, బడ్జెట్ లేదనే ప్రభుత్వ వాదన అవాస్తవమని విమర్శించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల వేలాది మంది పేద విద్యార్థులు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడిసిన్ వంటి ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. 2008లో ఆర్ కృష్ణయ్య చేపట్టిన ఐదు రోజుల ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగానే ఈ పథకం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు.అలాగే జీవో నెం.9 పేరుతో ఫీజులు చెల్లించని విద్యార్థులపై చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించడం అన్యాయమని, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం సజావుగా అమలవుతున్నప్పుడు తెలంగాణలో ఎందుకు సమస్యలు సృష్టిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దపల్లి ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మంద రాకేష్, ఎండి అయూబ్, జాగిరి సంతోష్ కుమార్, మందు ఆపిని, మహంకాళి స్నేహం, కాంపెల్లి శ్రీమాన్, కోటగిరి మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓదెల ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్...



**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :**
పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని స్థానిక నాయకులు, ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఓదెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆలయ చైర్మన్, ఆలయ డైరెక్టర్లు, ఆలయ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అండ



**ప్రజా వాయిస్/రాయపర్తి :**
వరంగల్ జిల్లా రాయపర్తి, మండలం సన్నూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు గూబ సోమక్క, వెంకటేశ్వర పల్లి గ్రామానికి చెందిన బుద్ధ పూలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని శుక్రవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు పరామర్శించారు.రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాలు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, ఒక ఆయిల్ క్యాన్‌ను సహాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిన్నపాక రజిత–రాంబాబు, ఉపసర్పంచ్ చీకటి కర్నాకర్, మాజీ సర్పంచ్ నలామాష సారయ్య, మండల పార్టీ నాయకుడు గూబ అశోక్, వార్డు సభ్యులు రాధికా–సంతోష్, అనూష–సురేష్, పార్టీ నాయకులు చిన్నపాక శ్రీనివాస్, వెంకన్న, వేణు, సందీప్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా కో ఆర్డినేటర్ పోస్టుల కోసం దరఖాస్తు స్వీకరణ

- పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసే యువతకు ప్రాధాన్యత
- సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- డిసిసి అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ



**ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో చీఫ్ :**

జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ ల పోస్టుల కోసం దరఖాస్తులను జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకవత్ ధన్వంతి లక్ష్మీనారాయణ దరఖాస్తు లను స్వీకరించారు. ఈ సందర్భంగా లకవత్ ధన్వంతి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, నేటి రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రజలకు పార్టీ విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను వేగంగా చేరవేసే ముఖ్యమైన వేదికగా మారిందన్నారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసే యువతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు, ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేసే యువతను ప్రోత్సహించడం తమ లక్ష్యమని తెలిపారు.

## మంథనిలో ప్రైవేట్ పాఠశాల మార్పు వదంతులు..

తల్లిదండ్రుల ఆందోళన... మద్దతు పలికిన సిపిఎం, బిజెపి



**ప్రజా వాయిస్ మంథని :**
మంథనిలోని ఒక ప్రైవేట్ పాఠశాలను విద్యా సంవత్సరం మధ్యలోనే విక్రయించారనే వదంతులు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించాయి. విద్యా వ్యాపారంలో భాగంగానే ఈ మార్పులు జరుగుతున్నాయనే ప్రచారంపై తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత భారీగా ఫీజులు వసూలు చేసి, పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయించిన అనంతరం ఒక్కసారిగా యాజమాన్యాన్ని మార్చుతున్నారనే వార్తలు రావడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని చౌరస్తాలో శుక్రవారం పలువురు తల్లిదండ్రులు సమావేశమై తమ ఆందోళనను తెలియజేశారు. అక్కడి ఉపాధ్యాయులు, బోధనా విధానానికి అలవాటుపడిన విద్యార్థులను మధ్యలో వేరే పాఠశాలలో విలీనం చేయడం లేదా యాజమాన్యాన్ని మార్చడం వల్ల వారి చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. అంతే కాకుండా, యాజమాన్య మార్పులతో ఫీజుల నిర్మాణం, రవాణా, పాఠశాల పేరును గానీ, యాజమాన్యాన్ని గానీ మార్చే ముందు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరించాలని, విద్యాశాఖ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం మధ్యలో పాఠశాలల విక్రయాలు, యాజమాన్య మార్పులపై ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని తీసకురావాలని, విద్యార్థుల హక్కులకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు కోరారు.

## ఆస్తి చిచ్చు... తండ్రి మృతి కలకలం

- తండ్రి మృతిపై న్యాయం చేయాలని పెద్ద కొడుకు వెంకటేశ్వర్లు డిమాండ్
- పోస్టుమార్టం అనంతరం కూడా దహన సంస్కారాలు అడ్డుకున్న కుటుంబ సభ్యులు

**ప్రజా వాయిస్,అనంతగిరి**: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిల సింగారం గ్రామంలో ఆస్తి వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కుటుంబ సభ్యులకు తెలియకుండా తండ్రి పేరున్న భూమిని చిన్న కొడుకు కుటుంబానికి రహస్యంగా రిజిస్ట్రేషన్ చేయించారనే ఆరోపణల నడుమ, శతాధిక వృద్ధుడు బుడిగ భద్రయ్య (101) చిన్న కొడుకు ఇంట్లో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది.తండ్రి మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన పెద్ద కొడుకు బుడిగ వెంకటేశ్వర్లు అనంతగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.
అయితే, మృతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాలని, ఆస్తి వివాదానికి పరిష్కారం లభించే వరకు అంత్యక్రియలు నిర్వహించబోమని వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు.
సమాచారం అందుకున్న ఎమ్మార్వో కమలాకర్, ఎస్ఐ ఏడుకొండలు ఇరువర్గాలతో చర్చించి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించినప్పటికీ, న్యాయం జరిగే వరకు దహన సంస్కారాలు నిర్వహించేది లేదని కుటుంబ సభ్యులు పట్టుబట్టడంతో అంత్యక్రియలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. పోలీసులు ఘటనపై విచారణ కొనసాగిస్తున్నారు.



## తూప్రాన్ రోడ్డులో వర్షపు నీటి సమస్యపై బీజేపీ వినతి

- 15వ వార్డు బీజేపీ నాయకుడు జోడు ప్రకాష్
- హెచ్పీ పెట్రోల్ బంక్ వెనుక కాలనీలో వర్షపు నీరు నిలిచిపోతున్న సమస్య
- కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేత
- తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ప్రజా వాయిస్, గజ్వేల్ :**
ప్రతి సంవత్సరం వర్షాకాలంలో తూప్రాన్ రోడ్డు, హెచ్పీ పెట్రోల్ బంక్ వెనుక కాలనీలో వర్షపు నీరు నిలిచిపోతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అంటూ 15వ వార్డు బీజేపీ నాయకుడు జోడు ప్రకాష్ మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డు బీజేపీ నాయకులు జోడు ప్రకాష్ ఆధ్వర్యంలో కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యను పరిష్కరించాలని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, ఎస్సీ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్, నాయకులు వెంకటేష్, గడియారం రాజేశ్వర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

## సుదీర్ఘ సేవలకు ఘన వీడ్కోలు..

- పెందూర్ చరణ్ దాస్‌కు సన్మానం
- పీఎంఆర్సీ ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ :**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్‌జీటీ పెందూర్ చరణ్ దాస్‌కు ఘన వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, సహచర ఉపాధ్యాయులు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో చరణ్ దాస్ విశేష కృషి చేశారని కొనియాడారు. క్రమశిక్షణ, సేవాభావం, విద్యార్థుల పట్ల అంకితభావంతో ఆదర్శ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన సమాజ సేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యాశాఖ ప్రతినిధులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్ మండలాధ్యక్ష పదవి బీసీలకే ఇవ్వాలి

- పదవులు లేకున్నా పార్టీ పటిష్టతకు బీసీలు అండగా నిలిచారు
- అందుకే దశబ్దాల సేవకు గౌరవం ఇవ్వండి
- సబితమ్మ నాయకత్వంలో సముచిత గౌరవం దుక్కుతుందనే విశ్వాసం ఉంది
- ఎంపీటీసీల ఫోరమ్ మాజీ మండలాధ్యక్షుడు మోర శ్రీనివాస్



**చేవెళ్ల (ప్రజావాయిస్ ):**
మొయినాబాద్ మండల రాజకీయాల్లో బీసీల ఆవేదన కొత్తది కాదు. గత పది సంవత్సరాలుగా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడినా, తగిన ప్రాతినిద్యం మాత్రం అస్సలు అందలేదు.మాజీ ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు మోర శ్రీనివాస్ చేసిన విజ్ఞప్తి ఈ ఆవేదనకు ప్రతిబింబం.శుక్రవారం మోరశ్రీనివాస్ ప్రజావాయిస్ తో మాట్లాడారు.గత దశాబ్ద కాలంగా బీసీ వర్గాలు పార్టీ కోసం నిరంతరం నిర్వీరామ కృషి చేసినప్పటికి,తగిన స్థానం దక్కలేదని అయన ఆవేదన వ్యక్తం చేశారు. పదవులు లేకున్నా పార్టీ పటిష్టత కోసం బీసీలు వెనుక డుగు వేయలేదన్నారు. ప్రతి ఎన్నికల్లో పార్టీ కోసం పోరాడం అంటూ భావొద్వేగంగా పేర్కొన్నారు. మాజీ మంత్రి,ప్రస్తుత ఎమ్మెల్యే సభిత ఇంద్రారెడ్డి నాయక త్వంలో బీసీలకు సముచిత న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.సబితమ్మ సైన్యంగా పనిచేయ డానికి, పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.మండలాద్యక్ష పదవి కేవలం ఒక పోస్ట్ కాకుండా, అటు బీసీలకు, ఇటు బీఆర్ఎస్ పార్టీకి గుర్తింపు తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తుందని అయన అన్నారు.ఈ నేపథ్యంలో మొయినాబాద్ మండ లాధ్యక్ష పదవి బీసీలకే ఇవ్వాలనే గట్టి డిమాడ్ రోజురో జుకు బలపడుతోంది.

## అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి అండగా అంబేద్కర్ నగర్ యూత్..



**ప్రజా వాయిస్, బయ్యారం:-**
మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్లోని తిమ్మిడి సాయి అనారోగ్యంతో బాధ పడుతున్న నిరుపేద కుటుంబానికి బయ్యారం ఎస్సీ కాలనీ వాసులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. బయ్యారం మండలం ఎస్సీ కాలనీకి చెందిన తిమ్మిడి వెంకటలక్ష్మి –వీరభద్రం దంపతుల చిన్న కుమారుడు తిమ్మిడి సాయి గత కొంతకాలంగా లివర్ ఇన్ఫెక్షన్తో తీవ్ర అనారోగ్యానికి గుర్తై చికిత్స పొందుతున్నాడు.
సాయి ఆరోగ్య పరిస్థితి, కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న హెచ్చు రమేష్ చలించిపోయి వైద్య ఖర్చులకు కుటుంబానికి కొంతైనా ఊరట కల్పించాలనే ఉద్దేశంతో కాలనీ పెద్ద మనుషుల మందుల గణేష్ సోమ వరపు సుధాకర్, సహకారంతో కాలనీ వాసులంతా తలా కొంత తోచినంత విరాళాలు సేకరించి రూ.35,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కాలనీ పెద్దమనుషులు మాట్లాడుతూ,సాయి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి, వారి కష్ట సమయంలో ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సాయి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని సాధారణ జీవితం గడపాలని కాలనీ వాసులు ఆకాంక్షించారు. అలాగే, సాయి వైద్యానికి మరింత ఆర్థిక సహాయం అవ సరమైనందున దాతలు, మానవతావాదులు తమకు తోచినంత సహాయం అందించి ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం సహాయం పొందిన తిమ్మడి వెంకటలక్ష్మి వీరభద్రం బాధితుడు సాయి అంబెద్కర్ నగర్ కాలనీ వాసులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారస్తులు పెడవల్లి వినయ్ కుమార్ మరియు కాలనీ పెద్దమనుషులు మందుల గణేష్,సోమవరపు సుధాకర్, హెచ్చు రమేష్, జినక లక్ష్మణ్, తుడుం రాజేష్,తదితరులు పాల్గొన్నారు..

## పాము కాటుతో ఆవు మృతి

- బాధిత రైతుని ఆదుకోవాలని పశువైద్య శాఖ ప్రభుత్వం పరిహారం అందించాలని కోరారు

**ప్రజా వాయిస్ షాబాద్ :**
షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామంలో తీవ్ర విచా రకరమైన ఘటన చోటుచేసుకుంది మన్మర్రి రోడ్డు పరిధిలో మేత మేస్తున్న సమయంలో పాము కాటు వేయడంతో ఆవు మృతి చెందినది బోడంపహాడ్ గ్రామానికి చెందిన రైతు సమ్మానికి చెందిన ఆవుగా గుర్తించారు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు సమ్మాని తన ఆవును మన్మర్రి రహదారి పరిసరాల్లో మేత కోసం తీసుకెళ్లగా అక్కడ పొదల్లో ఉన్న విషపాము ఆవును కాటు వేసింది గమనించిన రైతు స్థానికుల సహాయంతో కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ విషం ఒంటికి పాకడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది తీవ్ర కష్టపడి పెంచుకున్న పాడి ఆవు హఠాత్తుగా చనిపోవ డంతో రైతు సమ్మాని కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. జీవనాధారంగా ఉన్న ఆవు మృతి చెందడంతో రూ. వేలల్లో నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం, సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి బాధిత రైతుకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామీణులు, స్థానికులు కోరుతున్నారు.

## గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు లింగన్న

- అడవి తల్లి ముద్దుబిడ్డ కామ్రేడ్ పూనం లింగన్నకు విప్లవ జోహార్లు.
- కామ్రేడ్ పూనం లింగన్న కు నివాళులర్పిస్తున్న న్యూ డెమోక్రసీ కార్యకర్తలు.



**ప్రజా వాయిస్ గార్ల :-**
సిపిఐ (ఎంఎల్ )న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ప్రతిఘటన ఉద్యమ నేత కామ్రేడ్ లింగన్న ఏడవ వర్ధంతి సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం ముందు గార్ల లో జరిగింది. కామ్రేడ్ లింగన్నకి ఘనంగా నివాళులర్పిస్తూ సిపిఐ (ఎంఎల్ )న్యూడెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి సక్రు ఈ సందర్భంగా మాట్లాడుతూ, జులై 31 వ తారీఖున కామ్రేడ్ లింగన్న దళంపై పోలీసులు తెల్లవారుజామున కాపు కాశి దళంపై కాల్పులు జరిపి పట్టుకొని, చిత్రహింసలు పెట్టి కొట్టి చంపారని సక్రు అన్నారు. లింగన్న గ్రామంలో యువజన సంఘం లో గ్రామ నాయకుడిగా పార్టీలో కొనసాగే సమయంలో ప్రజా ప్రతిఘటన వైరుధ్యాల తోటి లింగన్న 1997లో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత దళంలో చేరి దళ కమాండర్ గా తో పాటు అంచలంచలుగా ఎదిగినాడని ఆయన అన్నారు. ఈ గిరిజన ప్రాంతంలో ఆదివాసి గిరిజన గిరిజన నేతల ప్రజలు నిత్యం లింగన్నను తలుచుకునేవారని ఆయన అన్నారు. ఈ గిరిజన ప్రాంతంలో పేద ప్రజలు పోడు భూములు కొట్టుకొని సేద్యం చేసుకుని బ్రతుకుతున్నారంటే కామ్రేడ్ లింగన్న త్యాగం ఎంతో ఉన్నదని గుండాల మండలంలో ఓపెన్ కాస్ట్ లో తీయాలని ప్రయత్నిస్తే లింగన్న ఈ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులకి గురవుతారని భూములు కోల్పోతారని ప్రజల్ని సమీకరించి ఉద్యమం చేసి ఓపెన్ కాస్ట్లను ఆపడం జరిగిందని బావులు తీస్తే ప్రజలకు ఉద్యోగాలు వస్తాయని భూములు కోల్పోరని అన్నారు అందుకే లింగన్నను రాజ్యం హత్య చేసిందని ఆయన అన్నారు,ఎన్కౌంటర్లతో ఉద్య మాలను ఆపలేరని అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని అడ్డగిం చలేరని కామ్రేడ్ లింగన్నను ఎన్కౌంటర్ చేసినంత మాత్రాన ఉద్యమాలు ఆగవని కామ్రేడ్ లింగన్న ఏ ఆశయాల సిద్ధి కోసం ఉద్యమంలో చేరి ప్రాణాలు అర్పించాడు ఆశయాలకు అనుకూ లంగా మనమందరం కృషి చేయాలని అప్పుడు మాత్రమే కామ్రేడ్ లింగన్నకు నిజమైన వారసులవుతామని సక్రు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బానోత్ మంగీలాల్ , సూత్రపు మనోహర్, నాయకులు తాళ్లూరి లక్ష్మీనరసయ్య, రాములు, కుమార్, లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు...

## పంట మార్పిడిపై తగిన చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**ప్రజా వాయిస్/కొత్త గూడ :** కొత్తగూడ మండలంలో పంట మార్పిడి విధానం కార్యక్ర మంలో భాగంగా రైతు బానోతు బిచ్చ, బానోతు సుమన్ పొలంలో ప్రాజెక్టు వైవిధ్యం కింద జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు
అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రక్రియ పరిశీలించి లబ్ధిదారులు బంగారి సాంబలక్ష్మి, గట్టి సుగుణ లతో మాట్లాడి గృహాలను వెంటనే నిర్మించుకోవాలని సూచించారు,
గాంధీనగర్ లోని గిరిజన బాలికల గురుకులమును పరిశీలించి విద్యార్థిని, విద్యార్థుల యొక్క విద్యాసామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు, అనంతరం వారితో మాట్లాడి వారి యొక్క అభిప్రాయాలను భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికల గురించి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారి లో రైతులు తదితరులు పాల్గొన్నారు




## స్కాలర్షిప్ బకాయిల విడుదలకు BJYM ఆందోళన

- బకాయిలు విడుదల చేసే వరకు పోరాటం కొన సాగిస్తామని బండ కార్తీక రెడ్డి వెల్లడి




**ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజ కవర్గం మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా భారతీయ జనతా యువ మోర్చా (BJYM) ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్లోని రెయిన్బో జూనియర్ అండ్ డిగ్రీ కళా శాలలో "ఫీజు బకాయి – బీజేపీ లడాయి" కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ GHMC మేయర్ బండ కార్తీక రెడ్డి మాట్లాడుతూ, స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవ డంతో వేలాది మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం BJP, BJYM పోరాటం బకాయిలు పూర్తిగా విడుదలయ్యే వరకు కొనసా గుతుందని స్పష్టం చేశారు.
విద్యార్థులకు హామీలు ఇవ్వడం కాకుండా, వారికి చట్టబ ద్ధంగా రావాల్సిన స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవా లని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో BJYM రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ నాగదీప్ గౌడ్, రావుల పృథ్వీ, శ్యామ్ కిరణ్ రెడ్డి, ఆర్థిక్ యాదవ్, శ్రీనాథ్, మంజునాథ్, విజయ్, రవితేజ, రాకేష్తో పాటు BJYM నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేగులగూడ గ్రామంలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం



**ప్రజా వాయిస్ కాసిపేట మండలం :**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం లోని రేగులగూడ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈరోజు ఉదయం దేవాపూర్ ఎస్సై గంగారం ఆధ్వర్యంలో దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగు లగూడ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో భాగంగా మొత్తం 30 బైక్లను, 5 ఆటోలను తనిఖీ చేసి ట్రాఫిక్ నిబంధ నలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించారు ఈ సందర్భంగా ఎస్సై గంగారం మాట్లాడుతూ, సైబర్ మోసాలు సోషల్ మీడియా విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచు కోకూడదని సూచించారు.ఫేక్ కాల్స్,ఫి షింగ్ సందేశాలు,సోషల్ మీడియా మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని అవ గాహన కల్పించారు.ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,హెల్మెట్ ధరించడం,సీటుబెల్ట్ వినియోగం తప్పని సరి అని,మద్యం సేవించి వాహనం నడ పకూడదని సూచించారు. అత్యవసర పరి స్థితుల్లో వెంటనే డయల్ 100 సేవలను వినియోగించాలని తెలిపారు.గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రజ లందరూ భాగస్వాములు కావాలని,గం జాయి డ్రగ్స్ వినియోగం ఆరోగ్యానికి సమాజానికి హానికరమని వివరించారు. యువత ఈ అలవాట్లకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపా లను పోలీసులకు వెంటనే తెలియజేయా లని కోరారు. ప్రస్తుతం స్వీయరక్షణ నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని తెలిపారు.గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో అలాగే ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను తగ్గించవచ్చని, భద్రతను పెంచవచ్చని వివరించారు. పోలీసులు ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొం దించడం నేరాలను నివారించడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను కొన సాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై గంగారం సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'మన చంద్ర ఫౌండేషన్' తో గ్రామాల్లో సేవల విస్తరణ

- నిరుపేదలు, మహిళలు, గర్భిణీలు, విద్యార్థులకు అండగా నిలుస్తాం
- చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ

**ప్రజావాయిస్ / మోమిన్పేట్:**
సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేప ట్టనున్నట్లు మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ తెలిపారు. నిరుపేద కుటుంబాలు, మహిళలు, గర్భిణీలు, విద్యార్థులు, రోగుల సంక్షేమమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.
శుక్రవారం మొరంగ పల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించిన అనంతరం, పులిగారి వెంకటయ్య ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువకులు డాక్టర్ చంద్రప్రియను శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా డాక్టర్ చంద్రప్రియ మాట్లాడుతూ, గ్రామాల్లో అవసరమైన చోట ఉచిత వైద్య శిబిరాలు, మహిళల సంక్షేమ కార్యక్రమాలు, గర్భిణీల ఆరోగ్య అవగా హన శిబిరాలు, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహక కార్యక్ర మాలు, నిరుపేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించేం దుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ ఎం. చంద్రశేఖర్ స్ఫూర్తితో నియోజక వర్గంలోని గ్రామాలన్నింటిలో పర్యటించి ప్రజల సమస్య లను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి మన చంద్ర ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన చోట సేవ చేయడమే తమ ధ్యేయమని, ప్రతి గ్రామంలో మానవతా దృక్పథంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బుదారపు బుచ్చిరెడ్డి, పులిగారి వెంకటయ్య, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## ఈ రోడ్లపై నడిచేదెట్ల మున్సిపల్ చైర్మన్ సాబ్..!

- రాంనగర్ 8వ వార్డులో మౌలిక వసతుల కోసం యంఐఎం ఆందోళన..
- సీసీ రోడ్లు, వీధి దీపాలు, మురుగు కాలువలు వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్..
- మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్ సోనీ యిర్మీయా ఆరోపణ..

**ప్రజా వాయిస్ జహీరాబాద్:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రాంనగర్ 8వ వార్డులో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ వార్డు కౌన్సిలర్ సోనీ యిర్మీయా శుక్రవారం ఆరోపిం చారు. కాలనీలో రహదారులు అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కాలనీలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా మున్సిపల్ అధికారులకు, మున్సిపల్ చైర్మన్కు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారి చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి రాంనగర్ 8వ వార్డులో సీసీ రోడ్లు, వీధి దీపాలు, మురుగు కాలువలు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అంతేకాకుండా యంఐఎం పార్టీ నాయకులు కూడా కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించి న్యాయం చేయాలని మున్సిపల్ అధికారు లను డిమాండ్ చేశారు.



## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం..



**పటాన్ చెరువు ప్రజావాయిస్ :**
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని.. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో వివరాలు సమర్పించని ప్రతి ఓటరు తమ బాధ్యతగా వెంటనే వివరాలు అందించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప కార్యా లయంలో.. నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 64.65 శాతం మాత్రమే నమోదు కావడం జరిగిందని తెలిపారు. బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో దేవాలయాలకు వచ్చే భక్తులతో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరికి ఎస్ఐఆర్ అంశంపై అవగాహన కల్పించడంతోపాటు.. ప్రక్రియలో పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి ఓటు అత్యంత కీలకమని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ముగియడానికి మరో మూడు రోజుల సమయం ఉన్నందున అర్హులైన ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణుల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు బ్రాహ్మణుల కోసం ఫంక్షన్ హాల్ నిర్మించి అందిస్తామని తెలిపారు.

## తోగుట పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన ఏసీపీ నర్సింలు

- వార్షిక తనిఖీలో భాగంగా స్టేషన్ ఆవరణ, రికార్డులు, కేసు ప్రాపర్టీ పరిశీలన
- ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వక వ్యవహరణపై సూచన
- సైబర్ క్రైమ్, రిసెప్షన్, సీసీటీవీ తదితర విభాగాల పనితీరు సమీక్ష

**ప్రజా వాయిస్/ సిద్దిపేట జిల్లా /గజ్వేల్ :**
గజ్వేల్ ఏసీపీ కె. నర్సింలు వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం తోగుట పోలీస్ స్టేషన్ను సందర్శించారు. స్టేషన్ ఆవరణ, అన్ని విభాగాలు, సిబ్బంది పనితీరు, రికార్డులు, కేసు ప్రాపర్టీ, స్టేషన్ ఆవరణలోని కేసు వాహనాలను ఆయన పరిశీలించారు. ఫిర్యాదుదారులతో గౌరవప్రదంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సింలు స్టేషన్లోని సైబర్ క్రైమ్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, సీసీటీవీ తదితర విభాగాల పని తీరును సమీక్షించి, సంబంధిత సిబ్బందికి సూచనలు అందజేశారు. ఆర్థిక నేరాలు, దొంగతనాలు, ఇతర నేరాల దర్యాప్తు నిష్పాక్షికంగా, వేగంగా నిర్వ హించాలని తోగుట ఎస్ఐ నవీన్, సిబ్బందికి ఆదేశించారు. ఈ తనిఖీలో తోగుట సర్కిల్ ఇన్స్పెక్టర్ లతీఫ్ పాల్గొన్నారు.

